



బిట్రగుంట : గురుకులంలో భోగిమంటలు వేసి సంబరాలు జరుపుకుంటున్న విద్యార్థులు

సంక్రాంతి సంబరం

విద్యాసంస్థల్లో ముందస్తు వేడుకలు

చిన్నారి హరిదాసుల కీర్తనలు.. చిట్టి చేతులతో రూపుదిద్దుకున్న రంగవల్లులు.. వాటి మధ్య గొబ్బెమ్మలు.. బాలికలు ఆటపాటలు.. తెలుగు సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా వస్త్రధారణ.. ఇలా సంక్రాంతి పండుగ ముందే వచ్చేసిందా!? అనిపించేలా విద్యాసంస్థల్లో సోమవారం వేడుకల సంబరాలు అంబరాన్ని తాకాయి. మంగళవారం నుంచి విద్యాసంస్థలకు సెలవుల నేపథ్యంలో పెద్దపండుగ విశిష్టతను చిన్నారులకు తెలిసేలా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు వేడుకలు నిర్వహించారు. విద్యార్థులపై బోగి పండ్లు పోసి ఉపాధ్యాయులు ఆశీర్వదించగా, వివిధ అంశాల్లో క్రీడాపోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. బోగోలు మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల్లో ప్రిన్సిపాల్ పద్మావతి ఆధ్వర్యంలో హరిదాసు, గంగిరెద్దుల వేషధారణ, తెలుగింటి ఆడపిల వస్త్రధారణ, పల్లెటూరి జానపద నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అట్టహాసంగా జరిగాయి.

- బిట్రగుంట



నెల్లూరులో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు, పిల్లలను ఆశీర్వదిస్తున్న ఉపాధ్యాయినులు (పైన)

జగన్‌కు మొండివైఖరి తగదు!

● కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ కార్మికుల ధర్నా

నెల్లూరు (సిటీ), జనవరి 8 : దేశవ్యాప్తంగా కరోనా వారియర్స్‌గా గుర్తింపు తెచ్చుకున్న పారిశుధ్య కార్మికుల పట్ల మొండిగా వ్యవహరించడం సీఎం జగన్‌కు తగదని మున్సిపల్ కార్మికులు వేలెత్తిచూపారు. 14వ రోజు సోమవారం గాంధీబొమ్మ నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు అజయ్‌కుమార్, మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, పెంచలనరసయ్య మాట్లాడారు. కార్మిక వర్గాల పట్ల ప్రభుత్వం నిరంకుశ ధోరణితో వ్యవహరిస్తోందని, ఈ విధానం సరికాదన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమను పర్మినెంట్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న కనీస డిమాండ్‌ను వినడానికి కూడా జగన్‌కు తీరికలేదా అని మండిపడ్డారు. ఈ ఆందోళనలో నాయకులు నాగేశ్వరరావు, కన్నెరకుమార్, కొండా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, కందుకూరులో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు మద్దతు ప్రకటించగా, కావలిలో భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు.



కావలిలో భిక్షాటన చేస్తున్న కార్మికులు



బోగోలులో అంబేడ్కర్ విగ్రహం ఎదుట ప్రమాణం చేస్తున్న అధికారులు, సిబ్బంది

బాధ్యతగా నడుచుకుంటాం!

జిల్లావ్యాప్తంగా 'జన్ భగీదారి'

"భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తూ అందరం బాధ్యతగా నడుచుకుంటాము." అని అంటూ అధికారులు ప్రతిజ్ఞ చేశారు. సోమవారం 'జన్ భగీదారి' కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా ఉన్నత స్థాయి నుంచి దిగువ స్థాయి వరకు అందరూ అంబేడ్కర్ విగ్రహాల ఎదుట ప్రతిజ్ఞ చేశారు. బోగులులో తహసీల్దారు హేమంత్ కుమార్, ఎంపీడీవో వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ పీఠిక ప్రమాణం చేశారు. పాఠశాలల్లోనూ ఉపాధ్యాయులు బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి విద్యార్థులతో ప్రమాణం చేయించారు. సచివాలయాలో కూడా జన్ భగీధరి కార్యక్రమం జరిగింది.

- బిట్రగుంట

● కాంట్రాక్టర్ల నెత్తిన మరో భారం
● కోర్టు ఆదేశిస్తున్నా కొర్రీలు వేస్తున్న ప్రభుత్వం
● దొడ్డిదారిన మామూళ్లు ఇస్తే బిల్లు విడుదల
● ఆ మార్గం కోసం ఎగబడుతున్న కాంట్రాక్టర్లు
● భారీగా బిల్లుల పెండింగ్.. ముందుకు కదలని పనులు

గత ప్రభుత్వం హయాంలో ఎవరు ముందు బిల్లు పెడితే వారికి మంజూరయ్యేది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక తొలుత కీలక నేతలు సిఫార్సుల మేరకు బిల్లులు మంజూరు చేసేవారు. ఆ తర్వాత కోర్టు ఆదేశిస్తే గానీ బిల్లులు మంజూరయ్యేవి కావు. ఇప్పుడు కోర్టులు ఆదేశాలు ఇస్తున్నా, పలు రకాల కొర్రీలతో వెనక్కు వెళుతున్న బిల్లులు, పర్సంటేజీ ఇస్తే మాత్రం వెంటనే విడుదలవుతున్నాయి. అది కూడా అందరికీ ఈ మార్గం సాధ్యం కావడం లేదు. సరైన మార్గంలో వెళ్లిన వారికే ఫలితం కనిపిస్తోందని కాంట్రాక్టర్ల వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఇప్పటికే ఏళ్ల తరబడి పెట్టిన పెట్టుబడి ప్రభుత్వం నుంచి రాక వడ్డీలతో సతమతమవుతున్న కాంట్రాక్టర్లకు ఈ కొత్తరకమైన పద్ధతి గుదిబండలా మారింది.

పర్సంటేజీ కొట్టు.. బిల్లు పట్టు !

నెల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బిల్లులు ఇప్పించేందుకు కొందరు బ్రోకర్లు తయారయ్యారని, వారు దాదాపు పదిశాతం వరకు పర్సంటేజీ డిమాండ్ చేస్తున్నట్లు అధికార వర్గాలు బహిరంగంగానే చెప్పుకుంటుండటం గమనార్హం. పర్సంటేజీలు ఇస్తున్న ఒకరిద్దరు కాంట్రాక్టర్లకు బిల్లు అప్‌లోడ్ చేసిన వెంటనే విడుదల అవుతోందని ఉదాహరణగా చూపిస్తున్నారు. దీంతో అధికారులను అడుక్కోలేక, కోర్టుల చుట్టూ తిరగలేక, వడ్డీలు కట్టలేక పలువురు ఎంతోకొంత పర్సంటేజీ ఇచ్చి బిల్లులు తెచ్చేసుకుందామన్న ఆలోచన కనిపిస్తోంది. బినామీలతో పనులు చేయించిన పలువురు ప్రజాప్రతినిధులు కూడా ఇదేబాటలో వెళుతుండడం పరిస్థితికి అద్దం పడుతోంది. జిల్లాలోని ఇంజనీరింగ్ శాఖల్లో రూ.వందల కోట్ల బిల్లులు పేరుకుపోయి ఉన్నాయి. ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ వంటి శాఖల్లో ఈ బిల్లుల పెండింగ్ మూలంగా ఎక్కడి అభివృద్ధి అక్కడే ఆగిపోయింది.




● ఇరిగేషన్ శాఖలో గత ప్రభుత్వంలో చేసిన వర్కులకు వైసీపీ ప్రభుత్వం బిల్లులను ఆపేసింది. రకరకాల విచారణలతో ఆలస్యం చేయడంతో కాంట్రాక్టర్లంతా కోర్టుకెళ్లి ఆదేశాలు తెచ్చుకున్నారు. మొదట్లో కంటెప్ట్ రాకముందే బిల్లులు చెల్లిస్తుండగా ఇప్పుడు కంటెప్ట్ వచ్చినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. ప్రస్తుతం జిల్లాలో అన్ని శాఖలతో పోలిస్తే ఇరిగేషన్ శాఖలోనే కోర్టు ధిక్కరణ కేసులు అధికంగా ఉన్నాయి. కోర్టు నుంచి బిల్లులు తెచ్చుకున్న కాంట్రాక్టర్లు మిగిలిన పనులను చేయకుండా చేతులెత్తేస్తున్నారు. డీఆర్-డీఎం చానెల్ ఆధునికీకరణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కోర్టు చుట్టూ తిరిగి మూడేళ్ల తర్వాత ఇటీవల బిల్లు తెచ్చుకున్నారు. ఇక మిగిలిన కాలువ పనులు చేయలేనని అధికారులకు నోటీసు ఇచ్చారు.



ఇరిగేషన్ శాఖలో సుమారు రూ.200 కోట్ల వరకు బిల్లులు పెండింగ్ ఉన్నట్లు సమాచారం.

● బిల్లుల మంజూరుకు ఏ విధానాన్ని ప్రాతిపదికగా తీసుకుంటున్నారో అర్థం కావడం లేదు. ముందుగా పంపిన వారికి కాకుండా చివరగా బిల్లు అప్‌లోడ్ చేసిన ఒకరిద్దరు కాంట్రాక్టర్లకు మంజూరైపోతున్నాయి. పోనీ అత్యవసర పనులకైనా బిల్లులు ఇస్తున్నారా అంటే అదీ లేదు. సోమశిల ఆప్రాన్ నిర్మాణం చేపట్టడం అత్యవసరమని నిపుణుల కమిటీ సూచించినా రెండేళ్ల నుంచి సదరు కాంట్రాక్టర్‌కు బిల్లు ఇవ్వకపోవడంతో ఎక్కడి పనులు అక్కడ ఆగిపోయాయి. సర్వేపల్లి రిజర్వాయర్ పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో రివిట్‌మెంట్ పనులు సగంలో ఆగిపోయాయి. దీని మూలంగా మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కట్ట కోతకు గురైంది.





● ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల్లో కూడా రోడ్లు, భవనాలు నిర్మించిన కాంట్రాక్టర్లకు నాలుగేళ్ల నుంచి బిల్లులు సరిగా రావడం లేదు. ఎన్డీబీ వంటి కీలకమైన కేంద్ర వర్కులకు కూడా ఒక్క రూపాయి బిల్లు ఇవ్వలేదు. దీం తో ప్రధానమైన ఆ రోడ్ల పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. కనీసం ప్యాచ్ వర్కులకు కూడా బిల్లులు రాని దుస్థితి నెలకొంది. దీంతో పంచాయతీరాజ్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధులతో రూ.160 కోట్లతో గ్రామీణ రోడ్ల అభివృద్ధికి టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు పనులకు ముందుకు రావడం లేదు. ఇటీవల రాష్ట్రంలోని కాంట్రాక్టర్లంతా విజయవాడలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా ఫలితం కనిపించలేదు. దీంతో అందరూ పర్సంటేజీల మార్గమే శరణ్యమని చెప్పుకుంటుండడం పరిస్థితికి అద్దం పడుతోంది.

రానున్న నాలుగు మాసాల్లో జిల్లాకు నీటి సంక్షోభం తప్పదా? అనే ప్రశ్నకు అవుననే సమాధానం నిపుణుల నుంచి వినిపిస్తోంది. ఇందుకు కారణం జిల్లాలోని ప్రధాన జలవనరుల్లో నీటినిల్వలు తగ్గడం. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ చర్యలపై ఇప్పటినుంచే దృష్టి సారించాల్సి ఉండగా ఆ దిశగా యంత్రాంగం దృష్టిసారించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

నీటి సంక్షోభం తప్పదా!?

● జలాశయాల్లో తగ్గుతున్న నిల్వలు
● భయపెడుతున్న 'సోమశిల'
● భవిష్యత్తు నీటి అవసరాలపై ఆందోళన


అనంతసాగరం, జనవరి 8 : గతేడాది నెల్లూరుతోపాటు రాయలసీమ జిల్లాల్లో లోటు వర్షపాతం కారణంగా అవసరాలకు అనుగుణంగా నీటి వనరులకు నీరు లభ్యత సమకూరలేదు. దీంతో సోమశిల, కండలేరు, కలిగిరి రిజర్వాయర్లలో ప్రస్తుతం ఆశించిన రీతిలో జలాలు లేవు. ఉన్న నీటిని కొంతమేరకు తాగునీటి అవసరాలకు మినహాయించి మొదటి పంటకు నీరు ఇస్తున్న పరిస్థితి. ఈ పంట చేతికందే సరికి రిజర్వాయర్లు ఖాళీ అయ్యేలా కనిపిస్తోంది. రానున్న వేసవికి తాగునీటి అవసరాలకు అనుగుణంగా నీరు సమకూర్చుకునే విషయంలో యంత్రాంగం చిత్తశుద్ధిగా వ్యవహరించాలి.

● రోజువారీగా 3,150 క్యూసెక్కుల సరఫరా

సోమశిల జలాశయంలో గతేడాది ఈ సమయానికి 50 టీఎంసీలకుపైగా నీటి నిల్వ ఉండగా ప్రస్తుతం 32.020 టీఎంసీలు మాత్రమే ఉంది. ఐఏబీ తీర్మానం ప్రకారం డెల్టా పరిధిలోని 2.2 లక్షల ఎకరాలకు నీరు ఇస్తున్నారు. దీంతోపాటు నాన్‌డెల్టా రైతుల విన్నపం మేరకు వారికి కూడా నీరు సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో సోమశిల నుంచి రోజువారీగా 3,150 క్యూసెక్కుల నీరు కిందకు వదులుతున్నారు. రెండు చోట్ల సాగులో ఉన్న వరి చేతికందాలంటే ఏప్రిల్ వరకు నీరు ఇవ్వాల్సి ఉంటుంది. సాగులో వెనుకబడ్డ రైతులను దృష్టిలో పెట్టుకొంటే మరో 15 రోజులు నీరు ఇవ్వక తప్పదు. ఇలాంటి పరిస్థితుల్లో 3,150 క్యూసెక్కుల వంతున 90 రోజులపాటు సోమశిల జలాలు కిందకు తరలిస్తే 2,83,500 క్యూసెక్కులు అంటే 26 టీఎంసీల నీరు ఖర్చువుతుంది. ఇక ఉన్న నీటిమట్టం 32 టీఎంసీలలో 26 టీఎంసీలు మినహాయిస్తే ప్రాజెక్టులో మిగిలేది 6 టీఎంసీలే. ఇది ఇలా ఉంటే మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో ఎండతీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉంది. దీంతో ఉన్న జలాలు కొంత మేరకు ఆవిరయ్యే ప్రమాదం ఉంది.

● తాగునీటి ఇబ్బందే!

ఏప్రిల్ నాటికి నీటిమట్టం సోమశిల నీటిమట్టం డెడ్‌స్టోరేజ్ కన్నా తక్కువకు చేరుకొనే పరిస్థితి ఉండగా తాగునీటి అవసరాలకు నీటి ఇబ్బందులు వస్తాయేమోనన్న ఆందోళన ఇప్పటి నుంచే కలుగుతోంది. ప్రాజెక్టుకు నీటిమట్టం పూర్తిగా పడిపోతే జిల్లావ్యాప్తంగా బోర్లకు భూగర్భజలాలు తగ్గే అవకాశం ఉంటుంది. ఇలాంటి పరిస్థితులను ముందుగానే అధికారుల లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



న్యాయం చేసేదెవరు?

భూమిని మార్చేశారు.. ఇల్లు కూల్చేశారు !

కలెక్టరేట్‌లో దంపతుల ఆత్మహత్యాయత్నం ● అడ్డుకున్న పోలీసులు

నెల్లూరు(హరనాథపురం), జనవరి 8 : కలెక్టరేట్‌లో ని తిక్కన భవన్ ఎదుట నెల్లూరు రూరల్ మండలం దేవరపాళెంకు చెందిన మురళి, శిరీష దంపతులు సోమవారం తలపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్ప డ్డారు. పోలీసులు అడ్డుకొని వారిని కాపాడారు. డీఆర్వో లవన్న బాధితుల వద్దకు వచ్చి విషయం తెలుసుకున్నారు. మురళి, శిరీష దంపతులు అక్కడికి వచ్చిన విలేకరులతో మాట్లాడుతూ దేవరపాలెంలో తమకు ఉన్న భూమిని రీసర్వేలో సీజేఎఫ్ఎస్ భూమిగా గుర్తించారన్నారు దీంతో అధికారులు ఆక్రమణ పేరుతో ఆ భూమిలో ఉన్న తమ ఇంటిని కూడా తొలగించారన్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు పలుమార్లు తెలిపి న్యాయం చేయాలని కోరినా ఫలితం లేకపోవడంతో ఆత్మహత్యాయత్నం చేశామ ని తెలిపారు. వారి వద్దకు చేరుకొన్న డీఆర్వో లవన్న వారి నుంచి విషయం తెలుసుకొని సంబంధిత తహసీల్దార్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.



మురళి, శిరీషలతో మాట్లాడుతున్న పోలీసులు

నెల్లూరు (వైద్యం), జనవరి 8 : తమ డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె సోమవారానికి 28వ రోజుకు చేరింది. జిల్లాలోని ఐసీడీఎస్ కేంద్రాల వద్ద అంగన్‌వాడీలు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. కలెక్టరేట్ వద్ద జరుగుతున్న దీక్షలో ఆల్‌ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అంకయ్య పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించి ప్రభుత్వం దమనకాండకు దిగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం తెలుసుకుని సామరస్యంగా పరిష్కరించాలే గాని ఇలాంటి చర్యలకు పూనుకోవడం సరికాదని హితవు పలికారు. సీపీఎం అనుబంధ అవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి షేక్ రఫీద్ మాట్లాడుతూ ప్రభుత్వం కాలయాపన చేయకుండా వెంటనే నేతలతో చర్చలు జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెహనాబేగం మాట్లాడుతూ ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకుంటామని వెల్లడించారు. కావలిలో జరుగుతున్న దీక్షలో అంగన్వాడీలు మోకాళ్లపై నిలబడి, పొర్లుదండాలతో ఆందోళన చేశారు. టీపీగూడూరు, అనంతసాగరంలలో ఎస్మా చట్ట ప్రతులను దహనం చేశారు. కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి, సీతారామపురం, తదితర ప్రాంతాల్లోనూ అంగన్వాడీలు ఆందోళన కొనసాగిస్తున్నారు.



కావలిలో పొర్లుదండాలు

మొక్కుతాం.. మా గోడు వినండి!

కొనసాగుతున్న అంగన్‌వాడీల దీక్ష!

'ఎస్మా' ప్రయోగంపై లాయర్స్ యూనియన్ అభ్యంతరం



స్నేహితులే చంపేశారు!

● పాతకక్షలతో కిరాతకంగా కత్తులతో నరికి.. ● నెల్లూరు నడిబొడ్డున దారుణం

నెల్లూరు (క్రైం), జనవరి 8 : ఆ ముగ్గురు మంచి స్నేహితులు. అయినా వారి మధ్య కేసు విషయమై మనస్పర్థలు ఉన్నాయి. మద్యం మత్తులో వారి మధ్య తలెత్తిన చిన్నపాటి ఘర్షణ చినికి చినికి పెద్దదైంది. అంతే వెంట తెచ్చిన కత్తులతో స్నేహితు డు అని కూడా చూడకంగా కిరాత కంగా చంపేశారు. నెల్లూరు నగర నడిబొడ్డున సో మవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటన అంత టా కలకలం రేపింది. పోలీసుల వివరాల మేరకు.. బుచ్చిరెడ్డిపాలెంలోని ఖాజానగర్‌కు చెందిన షేక్ ఆసీఫ్ అలియాస్ ఫోరాపై (35) పలు కేసులు ఉన్నాయి. శాంతినగర్‌కు చెందిన అన్నదమ్ములు షాకీర్, అస్లాం లు. నెల్లూరులోని వైఎంసీఏ మైదానం సమీపంలో తోపుడుబండ్లలో పం డ్లు విక్రయిస్తుంటారు. ఫోరాకు షాకీర్, అస్లాంలు స్నేహితులైనా కొంతకాలంగా పాత కక్షలు ఉన్నాయి. కోర్టు లో నడుస్తున్న ఓ కేసు విషయమై వీరి మధ్య చర్చలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం బు చ్చి నుంచి వచ్చిన ఫోరా కూరగాయల మార్కెట్ ఆవరణలో షాకీర్, అ స్లాం మద్యం సేవిస్తుండగా పాత గొడవలకు సంబంధించి వారిమధ్య మాటామాటా పెరిగింది. చినికి చినికి అది పెద్దదవడంతో షాకీర్, అస్లాంలు కత్తులు, బీర్ సీసాలతో ఫో రాపై విచక్షణా రహితంగా దాడి చేశారు. అక్కడే ఉన్న మరో ఇద్దరు వారిని అడ్డుకునే ప్రయత్నం చేసినా ఆగలేదు. ఫోరాపై దాడి అనంతరం షాకీర్, అస్లాంలు పరారయ్యారు. సమాచారం అందుకున్న చిన్నబజారు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని కొన ఊపిరితో ఉన్న ఫోరాను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగానే ఫోరా మృతి చెందాడు. చిన్నబజారు ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ కల్యాణ రాజు, ఎస్ఐ సైదులు ఘటనా స్థలిలో సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. ఫోరా మృతి విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు మార్చురీకి చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు. కువైట్ నుంచి ఫోరా భార్య మున్నీ ఈ నెల 7వ తేదీన తిరిగి వచ్చింది. తన భర్తతో సంతోషంగా గడుపుదామని వచ్చిన తనకు 24 గంటల గడవక ముందే భర్త శవమై కనిపించడంతో ఆమె బాధ వర్ణనాతీతంగా మారింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.





మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు (ఇన్‌సెట్) మృతుడు ఫోరా (ఫైల్)

రెండిళ్లలో చోరీలకు పాల్పడిన

ముగ్గురు యువకుల అరెస్ట్

● 10 సవర్ల బంగారు నగలు రికవరీ


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం

కలువాయి, జనవరి 8: రెండు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు యువకులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి సుమారు 10 సవర్ల బంగారు నగలు రికవరీ చేసినట్లు రాపూరు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక పోలీ స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి ఈ కేసులకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. కలువాయి మండలం కుల్లూరుకు చెందిన పెంచలయ్య హైదరాబాదులో ఉద్యోగం చేసుకుంటూ ఉంటారు. ఇటీవల కుమారై డెలివరీ కోసం ఆయన భార్యతో కలసి కుల్లూరుకు వచ్చి తిరిగి ఇంటికి తాళం వేసుకుని భార్య, కుమారైతో కలిసి హైదరాబాదుకు వెళ్లిపోయారు. ఈనేపథ్యంలో గత నెల 30వ తేదీన ఇంటి తాళాలు పగలగొట్టి, బీరువాలోని వస్తువులు కింద పడి ఉన్నాయని పెంచలయ్యకు ఆయన సోదరి సమాచారం అందించారు. దీంతో పెంచలయ్య కుల్లూరుకు చేరుకుని ఇంట్లో దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులకు స్పష్టమైన సమాచారం అందింది. దీంతో నిందితుల కోసం గాలిస్తుండగా కుల్లూరుకు చెందిన చింతలపల్లి పెంచలయ్య (నాని), నిప్పట్లపల్లి రవి, బెజ్జల సుధాకర్ గ్రామం విడిచి వెళ్లేందుకు బస్టాండులో ఉన్నారు. నిఘా ఉంచిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఈ చోరీతోపాటు గ్రామంలో మరో చోరీ కూడా తామే చేసినట్లు అంగీకరించినట్లు సీఐ తెలిపారు. దీంతో రెండు చోరీలకు సంబంధించి 10 సవర్ల బంగారు నగలు రికవరీ చేసినట్లు ఆయన వివరించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన కలువాయి ఎస్ఐ అయ్యప్ప, ఆయన సిబ్బందిని సీఐ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

మర్రిపాడు, జనవరి 8: పదిరోజుల క్రితం చుంచులూరు వద్ద నెల్లూరు- ముంబయి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. రాజుపాలెంకు చెందిన దేవండ్ల సుబ్బరాయుడు (40) గత నెల 28న బైక్‌పై మర్రిపాడు వెళ్తుండగా అదుపుతప్పి కింద పడటంతో తీవ్ర గాయాలుకాగా చికిత్స నిమిత్తం ఆత్మకూరుకు తరలించారు. పరిస్థితి విషమంగా వుండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి స్విమ్స్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారీ చోరీ ఘటనలో కేసు నమోదుపై మల్లగుల్లాలు


అంబేద్కర్ నగర్‌లో చోరీ జరిగిన భవనం

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 8: స్థానిక అంబేడ్కర్ నగర్‌లో ఉంటున్న ఏఎన్ఎం రాజేశ్వరి ఇంట్లో డిసెంబరు 24న 16సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. 25న బాధితురాలు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. పోలీసులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి, అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. అనుమానితులు ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వారు. కాగా కొంతకాలంగా వారు రాజేశ్వరి ఇంటి మిద్దెపై అద్దెకుంటూ ఆమెకు సాయంగా ఉండేవారు. ఈ క్రమంలో ఓసారి చోరీకి గురైన ఆభరణాల్లో 13సవర్లు ఉన్న రెండు ఆభరణాలను ఫంక్షన్ పేరుతో వారు తీసుకెళ్లి తిరిగి తెచ్చి ఇచ్చారు. అయితే ఆ ఆభరణాలను బీరువాకు బదులు ర్యాక్‌లోని దుస్తుల్లో రాజేశ్వరి ఉంచారు. ఆ సంగతి అద్దెకున్న దంపతుల్లో భార్యకు మాత్రమే తెలుసు. ఈ క్రమంలో కేసు విచారించిన ఎస్ఐ మీ ఆభరణాలు ఎక్కడికీ పోలేదు. మీ ఇంట్లో అద్దెకున్న వాళ్లే తీశారని నిర్ధారించి రికవరీ చేస్తామని రాజేశ్వరికి ధైర్యం చెప్పారు. ఈ నేపథ్యంలో అనుమానితులను అధికార పార్టీకి చెందిన నాయకుల పైరవీలతో పోలీసులు వదిలేశారు. వారిపై కేసు కూడా నమోదు చేయలేదు. దీంతో విషయాన్ని డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగలేదని బాధితురాలు పేర్కొంది. మొత్తానికి చోరీ చేసింది ఆ ఇద్దరేనని ఎస్ఐ తేల్చి చెప్పినా, వారిపై ఎలాంటి చర్యలు లేవు. చోరీ జరిగి 15రోజులైనా కేసు నమోదు చేయకపోగా, అనుమానితులను వదిలేయడం స్థానికంగా ఆందోళన రేపింది. దీనిపై సీఐ హైమారావును వివరణ కోరగా చోరీ విషయం సోమవారం తమ దృష్టికి వచ్చినట్టు చెప్పా రు. ఎస్ఐని అడిగితే సీడీఆర్ పెట్టినట్టు చెప్పారన్నారు. వెంటనే కేసు నమోదు చేయించి దర్యాప్తు చేస్తామని ఆయన వివరించారు.

అదుపుతప్పి గుంతలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

తప్పిన ప్రమాదం



ఉదయగిరి రూరల్, జనవరి 8: మండలంలోని దాసరిపల్లి సమీపంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న గుంతలోకి దూసుకెళ్లి పెద్ద ప్రమాదం తప్పిన సంఘటన సోమవారం చోటు చేసుకొంది. వివరాల మేరకు.. స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన సూపర్‌లగ్జరీ బస్సు ఉదయగిరి నుంచి విజయవాడకు వెళుతుంది. దాసరిపల్లి సమీపానికి వెళ్లేసరికి బస్సు వెనుక వస్తున్న ద్విచక్ర వాహనదారుడు హారన్ కొట్టి గట్టిగా కేకలు వేశాడు. దీంతో బస్సు డ్రైవర్ ఏమైందోనని డోర్ గుండా చూశాడు. డోర్ లాక్ చేయకపోవడంతో అతను జారి కిందిపడిపోయాడు. అనంతరం బస్సు కొంతదూరం వెళ్లి రోడ్డు పక్కనే ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో బస్సుకు ఎదురుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బస్సులో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికుల్లో ఒక వృద్ధురాలికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ కిందపడడంతో కాలికి గాయమైంది. అటుగా వెళుతున్న వాహనదారులు విషయాన్ని గుర్తించి ప్రయాణికులను అత్యవసర ద్వారం ద్వారా బయటకు తీసి గాయపడ్డ వృద్ధురాలిని వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఒకరి డిబార్

వెంకటాచలం, జనవరి 8 : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలలో ఒక విద్యార్థి డిబార్ అయినట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలలో 106 మంది, మధ్యాహ్నం జరిగిన మూడవ సెమిస్టర్ పరీక్షలలో 248 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఉదయం మొదటి సెమిస్టర్ పరీక్షలలో నాయుడుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి డిబార్ అయినట్లు పేర్కొన్నారు.

12 వరకు న్యాయవాదులు విధుల బహిష్కరణ

నెల్లూరు (లీగల్), జనవరి 8 : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్-2023కి వ్యతిరేకంగా న్యాయవాదులు చేస్తున్న ఆందోళనను ఈనెల 12వతేదీ వరకు కొనసాగించాలని నెల్లూరు న్యాయవాదుల బార్ అసోసియేషన్ తీర్మానించింది. సోమవారం మధ్యాహ్నం నెల్లూరు బార్ అసోసియేషన్ హాలులో జరిగిన న్యాయవాదుల జనరల్ బాడీ సమావేశంలో అధిక శాతం మంది న్యాయవాదులు ఉద్యమాన్ని కొనసాగించాలని అభిప్రాయం వ్యక్తం చేయడంతో 12వ తేదీ వరకు వివిధ రూపాలలో నిరసన తెలుపుతూ కోర్టు విధులను బహిష్కరించాల తీర్మానించారు. కోర్టులలో బెయిలు, అవుటాఫ్ ఆర్డర్ పిటిషన్లు కూడా వేయకూడదని నిర్ణయించారు. ఈ ఉద్యమం ప్రజల్లోకి వెళ్లేందుకు సీనియర్ న్యాయవాది ఎం బ్రహ్మం అధ్వర్యంలో ఓ స్పెషల్ కమిటీని నియమించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎస్ఎం.సుభాని, ప్రధాన కార్యదర్శి మద్దిబోయిన సుందరయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

● **టీడీపీ, జనసేన నిరసన**

తెలుగుదేశం పార్టీ, జనసేన లీగల్ సెల్ సంయుక్త అధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం జిల్లా కోర్టు ప్రాంగణం ఎదుట ఆందోళన చేపట్టి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ లీగల్ పార్లమెంటరీ నియోజకవర్గం కన్వీనర్ షేక్ రియాజ్ బాషా, రూరల్ నియోజకవర్గ కన్వీనర్ షేక్ అన్వర్‌బాషా, జనసేన లీగల్ సెల్ అధ్యక్షుడు సీహెచ్ రాజేష్, సీనియర్ న్యాయవాదులు షేక్ నన్నేసాహెబ్, ఈదూరు భాస్కరయ్య, పువ్వాడ శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	90
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	170
స్కిన్‌లెస్	190
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5982
వెండి కిలో ధర	రూ. 74,000
వెండి ఒక గ్రాము	రూ. 76.00

దారి దోపిడీపై పోలీసులు ముమ్మర దర్యాప్తు

నెల్లూరు(క్రైం), జనవరి 8: నగరంలో ఈ నెల 6వ తేదీ రాత్రి దారి దోపిడీ చేసి రూ.కోటి విలువ చేసే బంగారు నగలు, నగదు దోచుకెళ్లిన కేసుపై పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ వీరానాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేస్తున్నాయి. బంగారు వ్యాపారిని హరికోటేశ్వరరావు నెల్లూరులో బంగారం తీసుకుని గూడూరుకు బయలుదేరినప్పటి నుంచి తిరిగి నెల్లూరు వచ్చేంత వరకు అన్ని అంశాలను సోమవారం పోలీసులు పరిశీలించారు. ఆయనను దుండగులు ఎక్కడి నుంచి వెంబడించారు, తెలిసిన వారా, బయటి వ్యక్తులా, ఎంత మంది ఉన్నారు.. అన్న కోణాల్లో విచారిస్తున్నట్లు సమాచారం. గూడూరులో వ్యాపారి బంగారు అభరణాలు విక్రయించేందుకు వెళ్లిన దుకాణాలు, ఆర్టీసీ బస్టాండు ప్రాంతాల్లోని సీసీ కెమెరాలన్నింటి ఫుటేజ్‌లను సేకరించారు.

దుమ్మూ ధూళితో బాధపడుతున్నా పట్టించుకోరా..!

● మైనింగ్ లారీలను అడ్డుకుని ఆందోళన

సైదాపురం, జనవరి 8: అధ్వా నంగా ఉన్న రోడ్లపై దుమ్మూ ధూళితో రోగాల పాలవుతున్నామని, సీఎం జగన్మోహన్‌రెడ్డికి మా గోడు పట్టదా అని ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్థానికులు పొదలకూరు వైపు వెళ్ళు సర్కిల్ వద్ద మైనింగ్ లారీలను అడ్డుకుని సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో రెం డు గంటల పాటు ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో బస్సుల్లో ఉన్న ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఈసందర్భంగా స్థానికులు మాట్లాడుతూ సైదాపురం నుంచి పొదలకూరు వైపు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుపై గుంతలను ఎర్రమట్టితో పూడ్చడంతో ఎర్రటి దుమ్ము గృహాల్లోకి చేరి అన్నం తినేందుకు కూడా ఇబ్బందిపడాల్సిన దుస్థితి ఏర్పడింది. చిన్నపాటి చినుకులకు రోడ్డు రొచ్చుగా మారి ప్రమాదాలకు గురికావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు మీదుగానే అధిక లోడుతో మైనింగ్ లారీలు తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి రూ.45 కోట్లతో రోడ్డు నిర్మాణం కోసం శంకుస్థాపన చేసినా పనులు పూర్తి కాలేదన్నారు.


లారీలను అడ్డుకున్న స్థానికులు

నేను ఏడాది క్రితమే చెప్పా..

నేడు ఎంపీలు, ఎమ్మెల్యేల ఆవేదన

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి



నెల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : 'నేను ఏడాది క్రితమే వైసీపీ ప్రభుత్వం, జగన్మోహన్‌రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి గురించి చెప్పా. నేడు పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు అదే ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తే అందరినీ ఇబ్బంది పెడతారు. ప్రజలంతా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి' అంటూ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి ఒక చేత్తో రూ.పది ఇచ్చి మరో చేత్తో రూ.వంద లాక్కుంటున్నారని విమర్శించారు. నిత్యావసరాలు, విద్యుత్.. ఇలా అన్ని ధరలు పెరిగాయన్నారు. ఎస్సీ ఎస్టీ, బీసీ వర్గాలకు రుణాలు దూరం చేశారని చెప్పారు. రంజాన్, క్రిస్మస్, సంక్రాంతి తోఫాను ఎత్తేసి పేదవాళ్లకు అన్యాయం చేశారని దుయ్యబట్టారు. చెత్తకు కూడా పన్ను వేసిన ఏకైక ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వమని విమర్శించారు. జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగులు, అంగన్‌వాడీలు, సమగ్ర శిక్ష, మున్సిపల్ కార్మికులు ఆవేదనతో ఉన్నారని పేర్కొన్నారు. పరిశ్రమలురాక నిరుద్యోగం పెరిగిందన్నారు. క్వార్ట్జ్‌కు అంతర్జాతీయ మార్కెట్లో మంచి ధర రావడంతో యజమానుల నుంచి దౌర్జన్యంగా గనులను లాక్కొని దోచుకుంటున్నారని మండిపడ్డారు.

రేపు జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలు

నెల్లూరు(విద్య), జనవరి 8 : నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో 'అభివృద్ధి చెందిన భారతదేశం-2047' అనే అంశంపై ఈనెల 10వ తేదీన జిల్లాస్థాయి వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎన్‌వైకే అధికారి మహేంద్రరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఉండే ఈ పోటీలకు 15 నుంచి 29 ఏళ్ల లోపు వయసు కలిగిన వారు హాజరు కావచ్చని పేర్కొన్నారు. గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందచే స్తామని, ఆసక్తి కలిగిన వారు 9963533440ను సంప్రదించాలని తెలిపారు.

వీఆర్ డిగ్రీ కళాశాలను పునఃప్రారంభించాలి

నెల్లూరు(విద్య) : నెల్లూరు నగరంలో వీఆర్ డిగ్రీ కళాశాలను తిరిగి ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీహర్ష కోరారు. కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందచేసి మాట్లాడారు. కళాశాల పరిరక్షణకు త్వరలోనే కార్యాచరణ రూపొందించి పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరాహార దీక్షలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు నరేంద్ర, చరణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

12న పద్య సారస్వత పరిషత్ వార్షికోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం) జనవరి 8 : పద్య సారస్వత పరిషత్ ఏర్పాటు చేసి 6 ఏళ్ల పూర్తి అయినందున ఈనెల 12న వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రక టనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఏసీనగర్ శ్రీవివేకానం ద ఇంగ్లీషు మీడియం స్కూల్లో జరుగుతుందన్నారు.

బాధితులకు న్యాయం చేయండి

'స్పందన'లో ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వరరెడ్డి


వృద్ధుడి సమస్య వింటున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైం), జనవరి 8: స్పందన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి అధికారులను ఆదేశించారు. ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని అర్జీలు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 130 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను ఎస్పీకి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగాల పేరిట యువతను తప్పుదోవ పట్టించి ప్రభుత్వ, ప్రైవేట్, సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఉద్యోగాలు కల్పిస్తామని, ఆన్‌లైన్ ద్వారా ఉపాధి కల్పిస్తామని నమ్మించి లక్షల్లో నగదు వసూలు చేసే వారి పట్ల ప్రజలు, యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రేమ పేరుతో వంచించి, పెళ్లి చేసుకోకుండా మహిళలను మోసం చేసే ఫిర్యాదులపై చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలన్నారు. అధిక కట్నం కోసం అత్తింటి వారి వేధింపులు, భర్త అత్తమామలు, కుటుంబ సమస్యలను వెంటనే విచారించి ఇరువర్గాల మధ్య కౌన్సెలింగ్ ద్వారా సమస్యకు పరిష్కారం చూపి, కాపురాన్ని చక్కదిద్దేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిస్సింగ్ ఫిర్యాదులను స్వీకరించి సాంకేతికత ఆధారంగా ఆచూకీ కనుగొని, వారి తల్లిదండ్రులకు అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు

● వినతులు స్వీకరించిన జాయింట్ కలెక్టర్


అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్

నెల్లూరు(హరనాథపురం), జనవరి 8 : కలెక్టరేట్ తిక్కన భవన్‌లో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమానికి అర్జీదారులు పోటెత్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సాధారణంగా ముగిసే స్పందన కార్యక్రమం 2.30 గంటల వరకు జరిగింది. అర్జీదారులు బారులు తీరారు. జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, జిల్లా రెవెన్యూ అధికారి లవన్నలు అర్జీలు స్వీకరించారు. ప్రజ ల సమస్యలు క్షుణ్ణంగా విని సంబంధిత అధికారులను పిలిపించి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. వచ్చిన అర్జీలు మళ్లీ మళ్లీ పునరావృతం కా కుండా చూడాలన్నారు.

● **22న సెలవు ప్రకటించాలి : బీజేపీ**

ఆయోధ్యలో రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించాలని కోరుతూ బీజేపీ నెల్లూరు నగర ఇన్‌చార్జి మిడతల రమేష్ జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

రాష్ట్రంలో విధ్వంసక పాలన

3 నెలల్లో అమరావతే రాజధాని

తెలుగు రైతు నేత రాధాకృష్ణమ నాయుడు

నెల్లూరు(వైద్యం), జనవరి 8 : రాష్ట్రంలో విధ్వంస, అరాచక పాలన నడుస్తోందని టీడీపీ తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపూరు రాధాకృష్ణమనాయుడు ఆరోపించారు. సోమవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మరెక్కడా లేనివిధంగా ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభమైన వైసీపీ పాలన ఆద్యంతం చీకటి రోజులేనన్నారు. వ్యవసాయ శాఖను మూసివేశారని, హార్టికల్చర్ రైతులు రోడ్డున పడ్డారన్నారు. దగా పడ్డ ధాన్యం రైతులు నేడు రాష్ట్రంలో రోజుకు ముగ్గురు చొప్పున ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పుల్లో కూరుకుపోయిన రైతుల్లో రాష్ట్ర మొదటి స్థానంలో ఉండగా కౌలు రైతుల ఆత్మహత్యల్లో రెండవ స్థానం, రైతు ఆత్మహత్యలలో మూడవ స్థానంలో ఉందన్నారు. రివర్స్ టెండరింగ్ పేరుతో నీటిపారుదల రంగాన్ని నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. జగన్ పాలనలో యువత జీవితాల్లో చీకట్లు అలుముకున్నాయన్నారు. టీడీపీ ప్రభుత్వంలో పరిశ్రమలు తీసుకువస్తే జగన్ ప్రభుత్వం ఆ కంపెనీలను తరిమేసిందని విమర్శించారు. 175 మంది ఎమ్మెల్యేలను మార్చినా వైసీపీకి ఓటమి తప్పదని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ తిరుపతి పార్లమెంట్ కార్యదర్శి రమణారెడ్డి, అధికార ప్రతినిధి ఈపూరు సుబ్బారెడ్డి, ముత్తుకూరు మండల అధ్యక్షుడు మల్లికార్జున యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణమ నాయుడు

యానాదులకు భూ హక్కులు కల్పించాలి

● కలెక్టరేట్ ఎదుట దళిత సంఘర్షణ సమితి ధర్నా


ధర్నా చేస్తున్న దళిత సంఘర్షణ సమితి నాయకులు

నెల్లూరు(హరనాథ పురం), జనవరి 8 : యానాదులకు అటవీ చట్టం ప్రకారం భూ హక్కులు కల్పించాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరే ట్‌లో దళిత సంఘర్షణ సమితి నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో దళిత, గిరిజనులకు ఇళ్ల స్థలాలు, భూమస్యలలో ఏ ఒక్కటి కూడా అధికారులు పరిష్కరించలేదని ఆరోపించారు. కావలిలో ఎమ్మెల్యే పనిలో అధికారులు నిమగ్నమయ్యారని ఆరోపించారు. రియల్టర్లు, వైసీపీ నాయకుల సేవలో అధికారులు తరిస్తున్నారని ఆరోపించారు. అల్లూరు లో తహసీల్దారు ఒక్కరికి కూడా ఒక్క పట్టా కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఈ ధర్నాలో దళితసేన జిల్లా అధ్యక్షుడు బి.బాలచెన్నయ్య, నాయకులు జెడ్డా వాసు, వరమ్మ, శ్రీలక్ష్మి, పీ.శ్రీనివాసులుపాల్గొన్నారు.

అత్యాచార బాధితులకు న్యాయ సహాయం

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వాణి

నెల్లూరు(వైద్యం), జనవరి 8 : జిల్లాలో అత్యాచారానికి గురైన మహిళలకు ఉచిత న్యాయసహాయం అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వాణి వెల్లడించారు. సోమవారం ప్రభుత్వం జనరల్ ఆసుపత్రిలోని సఖీ వన్‌స్టాప్ సెంటర్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధితురాలికి న్యాయ సహాయంతోపాటు మానసిక కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ఈ వన్‌స్టాప్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. 18 ఏళ్ల లోపు మహిళలపై జరిగే అరాచకాలు, లైంగిక వేధింపులు, వివాహితులపై జరిగే వేధింపులు, బాలల రక్షణ కొరకు ఏర్పాటు చేసిన గృహ హింస చట్టం కింద బాధితులకు డీవీ యాక్ట్ ద్వారా ఉచిత కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. ఎవ రైనా బాధిత మహిళలు ఉంటే జిల్లా న్యాయసేవ అధికార సంస్థను సంప్రదిస్తే తగిన సూచనలు, సలహాలు ఇస్తామని చెప్పారు. ఆయా కేసులకు సంబంధించి న్యాయవాదిని ఏర్పాటు చేసి ఒక్క రూపాయి ఖర్చు లేకుండా లోక్‌అదాలత్ ద్వారా న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఒన్‌స్టాఫ్ సెంటర్ ఏవో షహనాజ్, డీవీ సెల్ లీగల్ కౌన్సిల్ దేవి ప్రియదర్శిని, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్తనాదాలు వినపడటం లేదా!? : అజీజ్

నెల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారినా ప్రభుత్వానికి వినపడడం లేదా.. అని నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక వీడియో విడుదల చేశారు. అందులో మాట్లాడుతూ వాతావరణ మార్పులు, ప్రభుత్వ పాలసీలతో రైతులు ఎంతో నష్టపోతున్నారన్నారు. కౌలు రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రం రెండో స్థానం, రైతుల ఆత్మహత్యల్లో మూడో స్థానంలో ఉందని చెప్పారు. తుఫాన్ దెబ్బకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోలేదన్నారు. పోలవరం ప్రాజెక్టును విస్మరించారని మండిపడ్డారు. జగన్ తన నీడను కూడా నమ్మే స్థితిలో లేరని, రాష్ట్రాన్ని కాపాడాలంటే ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమని పేర్కొన్నారు.

ఆరోపణలకు ఆధారాలు సమర్పించాలి

● జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సాధికారత అధికారి రమేష్

నెల్లూరు(హరనాథపురం), జనవరి 8 : జిల్లా దళిత గిరిజన హక్కుల పరిరక్షణ కమిటీ నాయకులు తనపై చేసిన ఆరోపణలు అవాస్తవమని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారిత అధికారి కామంచి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోపణలు చేసినప్పుడు చట్టపరంగా ఆధారాలు సమర్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎలాంటి ఆధారాలు సమర్పించకుండా జిల్లా దళిత గిరిజన సంఘాల నాయకులు నన్ను, నాకుటుంబాన్ని అవమాన పరిస్తే అండర్ సెక్షన్ 195(1)(ఏ) క్రిమినల్ ప్రొసీజర్ 1973 ప్రకారం చర్యలు తీసుకొంటామని తెలిపారు.

రక్తదాన శిబిరాలకు దాతలు సహకరించాలి

డీఎంహెచ్‌వో పెంచలయ్య

నెల్లూరు(వైద్యం), జనవరి 8 : జన్ భగీదారీ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 10వ తేదీన వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించే రక్తదాన శిబిరాలకు దాతలు సహకరించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య కోరారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన జన్ జన్ భగీదారీ కార్యక్రమంలో భాగంగా భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ పురస్కరించుకుని ఈ నెల 10న దర్గామిట్టలోని ఎన్‌జీవో హోం, ఆత్మకూరు ప్రభు త్వ జిల్లా ఆసుపత్రి, కందుకూరు, కావలి ఏరియా ఆసుపత్రులలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పా రు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్ వలి, ఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు పెంచలరావు, డాక్ట ర్ ప్రమోద్, డాక్టర్ సునీల్, డిప్యూటీ డెమో కనకరత్నం, రమే ష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భోగిలో ప్లాస్టిక్ నివారించాలి

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని భోగి పండుగ రోజున ప్లాస్టిక్ వ్యర్థాలను భోగి మంటల్లో వేయవద్దని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య కోరారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రూపొందించిన స్వచ్ఛభారత్ - శాంతి భోగి అన్న కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను సంప్రదాయ పద్ధతులలో జరుపుకోవాలన్నారు. రబ్బర్, ప్లాస్టిక్, చర్మంతో కూడిన వస్తువులు, టైర్లు భోగి మంటల్లో వేసి కాలుష్యాన్ని వ్యాపించ చేయవద్దని హితవు పలికారు. దీని వల్ల పలు వ్యాధులు ప్రబలడంతోపాటు పర్యావరణాన్ని పాడు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో జయప్రకాష్, శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, నంద్యాల మాలిని, ప్రసాద్, రాందాసు, వీరయ్య, విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎంహెచ్‌వో, అధికారులు

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి



కరటంపాడులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ కేతా



ఉదయగిరి రూరల్: అంబేడ్కర్ విగ్రహం వద్ద అధికారులు...



కందుకూరు : అంబేడ్కర్‌కు సబ్ కలెక్టరు, కమిషనర్, డీఎల్‌డీవో తదితరుల నివాళి

జాతి గర్వించదగ్గ ముద్దుబిడ్డ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

కావలిటౌన్, జనవరి 8: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శప్రాయులని, జాతి గర్వించదగ్గ ముద్దుబిడ్డని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ట్రంకురోడ్డు బ్రిడ్జి కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో ముందుగా ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 19న విజయవాడలోని 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్మోహన్ రెడ్డి ఆవిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పందిటి కామరాజు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కనమర్లపూడి నారాయణ, గంధం ప్రసన్న, కుందుర్తి కామయ్య, కేతిరెడ్డి శివకుమార్, కేశవులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు: జన్ భగీదారి కార్యక్రమంలో భాగంగా సోమవారం బీఆర్ అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి సబ్ కలెక్టరు విద్యాధరి, మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్, డీఎల్‌డీవో పద్మజ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా శ్రీనగర్‌కాలనీ, ప్రకాశం కాలనీలలోని అంబేడ్కర్ విగ్రహాలకు, మున్సిపాలిటీ పరిధిలోని దూబగుంట వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాలతో అలంకరించి నివాళులు అర్పించారు.

వలేటివారిపాలెం: మండలంలోని బడేవారిపాలెం, నేకునాంపురం, వలేటి వారిపాలెం, తదితర గ్రామాల్లో జన్ భగీదారి కార్యక్రమంలో భాగంగా సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బడేవారిపాలెం, వలేటివారిపాలెం ఎంపీడీవో కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీపీ పీ మౌనిక, జడ్పీటీసీ సభ్యురాలు ఈ భారతి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుందరమ్మ, వలేటివారిపాలెం, నేకునాంపురం గ్రామ సచివాలయల్లో సర్పంచులు సాదు శ్రీలత, కొల్లూరి లక్ష్మమ్మలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అధికారులు ప్రజాప్రతినిదులచే ప్రతిజ్ఞ చేయించారు.

బిట్రగుంట: బోగోలు మండలంలోని అధికారులు,సచివాలయ సిబ్బంది జన్ భగీదారి కార్యక్రమంలో భాగంగా సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజ్యాంగ పీఠిక ప్రమాణం చేశారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉపాధ్యాయులు విద్యార్థులతో ప్రమాణం చేయించారు. తహసీల్దారు హేమంత్ కుమార్, ఎంపీడీవో వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : ఆత్మకూరు, అర్బన్, రూరల్ పరిధిలోని సచివాలయాల వద్ద, అంబేడ్కర్ విగ్రహాల వద్ద సోమవారం సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్రమంలో పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పలువురు ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో, కరటంపాడు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, జేఏసీ మండల కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర, సర్పంచ్ పూనుగుంట రేవతి, ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ తదితరులు ఘనంగా నివాళులు అర్పించారు. బండారుపల్లిలోని అంబేడ్కర్ విగ్రహానికి మండల పరిషత్ కార్యాలయ ఏవో కె శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అనంతసాగరం: జన్ భగీదారి కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు అధికారులు నివాళులు అర్పించారు. అలాగే ఎస్సీ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు బాబా సాహెబ్ అంబేడ్కర్ సమాజానికి చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంపూర్ణమ్మ, తహసీల్దారు సుభాషిణి, ఎంపీడీవో మదుసుదన్‌రావు, సోర్ప్ డైరెక్టర్ కాలువ నరసింహులు, జేవీవి పెంచలయ్య, గ్రంథపాలకుడు నారాయణరావు. తదితరులు పాల్గొన్నారు.

సంగం: మండల కేంద్రమైన సంగంలో సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జన్ భగిదారి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు కార్యాలయం వెలుపల ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నాగరాజు, ఎంపీడీవో గోపీ, ఎంఈవోలు జానికీరామ్, మల్లయ్య, బీఎస్పీ, వైసీపీ నాయకులు, ఇతర అధికారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జన్ భగీదారి కార్యక్రమంలో భాగంగా సోమవారం అధికారులు, ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు పట్టణంలోని అంబేడ్కర్ భవన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ జీ ఓబులరెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఈవోపీఆర్డీ మల్లికార్జున, ఎంఈవో శ్రీనివాసులు, ఈవో నరసయ్య, సర్పంచ్ గౌస్‌మొహిద్దీన్, బీసీ నాయకుడు మట్ల లక్ష్మయ్య, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు : భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ అన్ని వర్గాలకు ఆదర్శనీయుడని తహసీల్దారు మల్లికార్జున, ఎంపీడీవో శ్రీదేవి అన్నారు. శుక్రవారం జన్‌భగీదారి కార్యక్రమంలో భాగంగా వరికుంటపాడు, తిమ్మారెడ్డిపల్లి, జీ.కొండారెడ్డిపల్లి గ్రామాల్లోని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దళిత ప్రజా ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ షేక్ అలీఅహమ్మద్, పీఏసీఎస్ చైర్మన్ గుంటుపల్లి. రామాంజనేయులు, వైసీపీ కన్వీనర్ మందలపు తిరుపతినాయుడు, ఏపీఎం పైనారూత్, ఎంపీటీసీ వసంతకుమారి, సర్పంచులు దిలీప్‌కుమార్, నారాయణమ్మ, ప్రతాప్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శివకుమార్, సమీర్, హరి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలకు అంబేడ్కర్ చిత్రపటాల పంపిణీ

భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలు, ఫ్లెక్సీలను సోమవారం ఎంపీడీవో శ్రీదేవి సచివాలయాలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ సహాయకులు సీతారామాంజనేయులు, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: జన్‌భగీదారి కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఎమ్మార్వో, ఎంపీడీవో, ఎంఈఓ కార్యాలయాలలో, సచివాలయ కేంద్రాలలో డా. బిఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

వింజమూరు: జన్ భగీదారి కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక బంగ్లా సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్ మధుసూదన్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు గణపం బాలకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ మలిరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బి శ్రీనివాసులురెడ్డి, సచివాలయ సిబ్బంది మండల పరిషత్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అయోధ్య అక్షితల గ్రామోత్సవం



అక్షితల గ్రామోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్థులు

సంగం, జనవరి 8: స్థానిక సంగమేశ్వరాలయానికి అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను సోమవారం మేళ తాళాలతో ఆంజనేయస్వామి ఆలయం వరకు తీసుకువచ్చారు. అనంతరం ప్రాంతాల వారీగా అక్షతల ప్యాకెట్లను పంపిణీ చేసేందుకు వాలంటీర్లకు అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కోటు కరుణాకర్‌రెడ్డి, గోపీ, వేమా మల్లిఖార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఆత్మకూరు, జనవరి 8: తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా మంజూరైన నిధులతో ఆత్మకూరు చెరువు సమీపంలో గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి సోమవారం మాజీ జడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ చిల్లారు ఆదిశేషయ్య, మంజూష దంపతులు భూమిపూజ నిర్వహించారు. గణపతి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, ఆలయ చైర్మన్ పులిమి రమేష్, రమాదేవి దంపతులు, 20 వార్డు కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి, శ్రీకృష్ణ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

కావలి కాలువలో నీటి ప్రవాహం పరిశీలన

సంగం, జనవరి 8: స్థానిక కావలి (బెజవాడ పాపిరెడ్డి) కాలువలో నీటి ప్రవాహాన్ని నిర్వాహణ కమిటీ బృందం సోమవారం పరిశీలించారు. కావలి కాలువ సెక్షన్ డీఈఈ రమణయ్య, ఏఈ వెంకటరమణయ్య, సంగం ఇరిగేషన్ ఏఈ బివి కృష్ణ, కావలి కాలువ హెడ్‌రెగ్యులేటర్ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించి చర్చించారు. రైతుల నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఉప కాలువలకు నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు.

బాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు : బొల్లినేని

ఉదయగిరి రూరల్, జనవరి 8: వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు తోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు పేర్కొన్నారు. సోమవారం ఉదయగిరిలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చెంచలబాబు యాదవ్‌తో కలిసి పలు వీధుల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ప్రజాదీవెన యాత్ర చేపట్టి ఇంటింటికి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన విలేఖరులతో అధికారంలోకి రాగానే ఉదయగిరిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, నరసింహ, ఓబులరెడ్డి, సందానీ, సజిల్, ఖాన్‌సా, అలీజాన్, మాబాషా, బొజ్జా నరసింహ, శివకృష్ణ, ఖాదర్‌బాషా, సురేష్, అబ్బయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు విస్మరించిన వైసీపీ

కలువాయి, జనవరి 8 : వైసీపీ పాలనలో ప్రజా సమస్యలు పట్టించుకునే నాధుడే లేడని తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పంటా శ్రీనివాసులరెడ్డి అన్నారు. సోమవారం కలువాయిలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిజమాల చిన్నయ్య ఆధ్వర్యంలో జరిగిన మార్పు కావాలి కాంగ్రెస్ రావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మళ్లీ మంచి రోజులు రావాలంటే కాంగ్రెస్ పార్టీ రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాలో బాధ్యతగా వ్యవహరించాలి

వరికుంటపాడు, జనవరి 8: మండల స్థాయిలో ఈ నెల 10వ తేదీ నుంచి జరిగే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీడీవో శ్రీదేవి అన్నారు. సోమవారం వైఎస్‌ఆర్ క్రాంతిపథం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సర్పంచ్ దిలీప్‌కుమార్, సీనియర్ సహాయకులు సీతారామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇస్కపల్లిలో వైద్య శిబిరం

వరికుంటపాడు, జనవరి 8: మండలంలోని ఇస్కపల్లి పంచాయతీలో సోమవారం కాకర్ల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగినేని నరసమ్మ, నాగినేని వెంకటేశ్వర్లు, గంగవరపు రామారావు, గంగవరపు వెంకటేశ్వరు పాల్గొన్నారు.

పాఠశాలలకు టాయిలెట్ క్లీనర్స్ పంపిణీ

సీతారామపురం : ప్రభుత్వ, ప్రాథమికోన్నత పాఠశాలలకు టాయిలెట్ క్లీనర్స్, క్రీడా పరికరాలను సోమవారం ఎంఈవో కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మస్తాన్‌వలి, మండల యుటిఎఫ్ నాయకులు వెంకటేశ్వర్లు, బాలకృష్ణ రెడ్డి, పేరాల శ్రీనివాసులు, పి బాలకృష్ణ, బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో మేటీలకే కీలకపాత్ర

ఉదయగిరి : ఉపాధి హామీ పథకంలో మేట్‌లదే కీలకపాత్ర అని ఎంపీడీవో ఈశ్వరమ్మ అన్నారు. సోమవారం స్త్రీశక్తి భవనంలో ఉపాధి హామీ మేట్‌లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, మండల వైసీపీ కన్వీనర్ ఓబులరెడ్డి, ఎంపీటీసీ పెదమస్తానీయస్థానీ, ఏపీవో శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



ఆత్మకూరు : సంక్రాంతి సంబరాల్లో చిన్నారులు

అల్లూరు, జనవరి 8 : మండలంలోని నార్త్‌మోపూరులో ఉన్న శ్రీచైతన్య విద్యాసంస్థల్లో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. చిన్నారులు వివిధ వేషధారణలతో సంక్రాంతి ముగ్గులు, భోగిమంటలు, గొబ్బెమ్మలు ఆడే కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శివకుమార్, డైరెక్టర్ రహంతుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

బిట్రగుంట: బోగోలు మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సోమవారం ప్రిన్సిపాల్ పద్మావతి ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా హరిదాసు, గంగిరెద్దుల వేషధారణ, తెలుగింటి ఆడపిల్లల వస్త్రధారణ, పల్లెటూరి జానపద నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అనురాధ, ఉపాధ్యాయురాలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం : మండలంలోని అయ్యవారిపల్లె ఎంపీయూపీ స్కూల్‌లో సోమవారం టీచర్లు, విద్యార్థులు ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. పాఠశాల ముందు రకరకాల రంగులతో ముగ్గులు వేశారు. అనంతరం భోగిమంటలు వేశారు. విద్యార్థులకు ఆటలు పోటీలు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి డేగా వెంకటేశ్వర్లు ఉప సర్పంచి కొండలరావు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని పలు పాఠశాలల్లో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను వైభవంగా నిర్వహించారు. లెర్నింగ్ ట్రీ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులు హరి దాసుల వేషాలు, సంక్రాంతి పాటలు, డ్యాన్స్‌లతో అలరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మేకపాటి శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంగం : మండలంలోని అన్ని పాఠశాల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు ముగ్గుల పోటీలతో పాటు వ్యాస రచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. గంగిరెద్దులు, హరిదాసు వేషధారణలో విద్యార్థులు అలరించారు.

సీతారామపురం: మండల పరిధిలోని సీతారామపురం, అయ్యవారిపల్లి హైస్కూల్‌లో, సంగసానిపల్లి ఎంపీపీ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, పేరాల శ్రీనివాసులు, వెంగయ్య, ఉపాధ్యాయిని ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

వింజమూరు: వింజమూరులోని శ్రీవివేకానంద ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ మద్దూరి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ తిరునాళ్లకు ఘనంగా ఏర్పాట్లు



పోలేరమ్మ ఆలయానికి పూలాలంకరణ చేస్తున్న కమిటీ సభ్యులు

అల్లూరు, జనవరి 8 : అల్లూరుపేట ఆధ్వర్యంలో నిర్వహించే పోలేరమ్మ తిరునాళ్లకు ఘనంగా ఏర్పాట్లు జరిగాయి. మంగళవారం నిర్వహించే ఈ తిరునాళ్లకు పలురకాల పూలతో అలంకరణ చేపట్టారు. భారీస్థాయిలో విద్యుత్ దీపాలంకరణ, ఆచారానుగుణమైన నృత్యాలు, మంగళవాయిద్యాలు, తీన్‌మార్ బ్యాండ్లు తదితర కార్యక్రమాలతోపాటు ప్రముఖ కళాకారులచే మ్యూజికల్ నైట్ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది మరింత ఆర్భాటంగా తిరునాళ్లను నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

పోలేరమ్మ తిరునాళ్లకు తరలిరండి

అల్లూరుపేటలో వెలసి ఉన్న పోలేరమ్మ తిరునాళ్లకు భక్తులు వేలాదిగా తరలి రావాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. సోమవారం వారు ఆలయంలో విలేకరులతో మాట్లాడారు. మంగళవారం ఎంతో వైభవోపేతంగా తిరునాళ్లను నిర్వహిస్తామన్నారు. ఆలయానికి పూలాలంకరణతోపాటు విద్యుత్ దీపాలంకరణ చేశామన్నారు. మ్యూజికల్ నైట్ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.కార్యక్రమంలో ఎం. సుకుమార్‌రెడ్డి, మేడ రామకృష్ణారెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, పుచ్చలపల్లి మదన్‌మోహన్‌రెడ్డి, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, నీలపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, వీరయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల దీక్షకు ఇంటూరి మద్దతు



పారిశుధ్య కార్మికుల దీక్షలో పాల్గొన్న ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జనవరి 8: మున్సిపల్ కార్మికులు స్థానిక అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో నిర్వహిస్తున్న రిలే దీక్షలో సోమవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పలు ఆశలు చూపి వారిచేత ఓట్లు వేయించుకున్న జగన్ మాత్రం గద్దెనెక్కాక కార్మికులకు మొండిచేయి చూపాడని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక పారిశుధ్య కార్మికులకు చంద్రబాబు న్యాయం చేస్తారని ఆయన భరోసాఇచ్చారు. దీక్షలకు కార్మికుల సంఘం నాయకులు కాకుమాని రవణమ్మ, పులి నాగేశ్వరరావు, మహేంద్ర, ఏఐటీయూసీ నాయకులు బీ సురేష్‌బాబు, ఆనంద్‌మోహన్, సీఐటీయూ నాయకులు ఎస్‌ఏ గౌస్ నాయకత్వం వహించారు.

ఆత్మకూరు : సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం కూడా కొనసాగింది. వారు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి సీఐటీయు, ఏఐటీయుసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చే శారు. టీడీపీ, సీపీఎం, సీఐటీయు నాయకులు నిరసనలో పాల్గొని మద్దతు తెలియజేశారు. సమాన పనికి సమాన వేతనం ఇస్తామని హామీ ఇచ్చిన సీఎం జగన్ హామీని గాలికొదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు, పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఎస్మా రద్దు చేయాలని అంగన్‌వాడీ నిరసన ప్రదర్శన



అనంతసాగరంలో ఎస్మా ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

కందుకూరు, జనవరి 8: అంగన్‌వాడీలపై ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కందుకూరులో అంగన్‌వాడీలు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షల శిబిరం వద్ద నుంచి పెద్దబజారు, పాత బస్టాండ్ సెంటర్ల మీదుగా గాంధీ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీల సంఘం నాయకురాళ్లు రహంతున్నీషా, రాజేశ్వరి, సరస్వతి, ప్రభావతి, అనూరాధ, సీఐటీయూ నాయకులు ఎస్‌ఏ గౌస్, ఎస్. పవన్‌కుమార్, డి. రామమూర్తి తదితరులు పాల్గొన్నారు. వారికి పారిశుధ్య కార్మికులు సంఘీభావం తెలిపారు.

కావలిటౌన్ : పట్టణంలోని అంగన్‌వాడీల శిబిరంలో సోమవారం పొర్లుదండాలు పెట్టి తమ నిరసన తెలిపారు. అంగన్‌వాడీల వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నేతలు వజ్రమ్మ, రఘురావమ్మ, విజయలతలు మాట్లాడుతూ ఎన్ని అడ్డంకులు కల్పించినా ఉద్యమాన్ని ఆపలేరన్నారు.కార్యక్రమంలో సీఐటీయూ నేతలు పెంచలయ్య, కృష్ణమోహన్, తాళ్లూరు మాల్యాద్రి పాల్గొన్నారు.

ఆత్మకూరు : సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు, చేపట్టిన సమ్మె సోమవారానికి 28వ రోజుకు చేరింది. వారు విధులను బహిష్కరించి ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన ప్రత్యేక శిబిరంలో బైఠాయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి రాధ, సెక్టార్ లీడర్లు కె రమణమ్మ, కామేశ్వరి, జమీల, విజయలక్ష్మీ, రూతమ్మ, విజయలక్ష్మీ, శ్రీదేవి, ఏ మస్తానమ్మ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

అనంతసాగరం : ప్రభుత్వం చేస్తున్న బెది రింపు ధోరణికి తగ్గమని సీఐటీయూ మండల అధ్యక్షుడు అన్వర్‌బాష తెలిపారు. సమ్మెలో భాగంగా సోమవారం సీడీపీవో కార్యాలయం ఎదుట బోగి మంటలో ఎస్మా చట్టం ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు వేము పెంచలయ్య పాల్గొన్నారు.

సీతారామపురం : స్థానిక ఎమ్మార్వో కార్యాలయ ప్రాంగణంలో అంగన్వాడీలు నిరసన దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కోడె రమణయ్య, ఆదిలక్ష్మి, కుమారి, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు : ఎస్మా జీవోలను సోమవారం అంగన్‌వాడీలు దహనం చేసి ఆందోళనను కొనసాగించారు. యూనియన్ నాయకురాలు షేక్. రజియా ఆధ్వర్యంలో జీవో ప్రతులను దహనం చేశారు. కాగా సీఐటీయూ నాయకులు మట్టె హరినారాయణ, రమణారెడ్డి సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించారు. అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం అత్యంత దారుణమని జనసేన మండలపార్టీ అధ్యక్షుడు పఠాన్ రసూల్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఉదయగిరి : సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు సోమవారం ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, ప్రమీలా తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు : అంగన్‌వాడీల సమ్మెకు సోమవారం ఏపీటీఎఫ్ ప్రతినిధి ఎల్‌సీ రమణారెడ్డి మద్దతు ప్రకటించారు. ఆయన వింజమూరులో అంగన్‌వాడీలను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల బీసీ సంఘ నాయకులు ఉన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు



పింఛన్ అందచేస్తున్న మహీధర్‌రెడ్డి

లింగసముద్రం, జనవరి 8 : కుటుంబంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డిదేనని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి చెప్పారు.సోమవారం లింగసముద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన పింఛన్ల పంపిణీలో ఆయన మాట్లాడారు. పేద కుటుంబాల ఉన్నతికి సీఎం ఎంతో కృషి చేశారని తెలిపారు. అనంతరం ఆయన పలువురికి పింఛన్లు అందజేశారు.ఈ సందర్భంగా స్థానిక ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, సర్పంచు పులి రాఘవులు, తహసీల్దార్ టీ ప్రసాద్, ఎంపీడీవో యు శేషుబాబు, వైసీపీ నేతలు పీ తిరుపతిరెడ్డి, వీ. కృష్ణారెడ్డి, సూరం కొండారెడ్డి సర్పంచు డీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు జగన్‌కే సాధ్యం

కలిగిరి, జనవరి 8: ఎన్నికల ముందు ప్రజల కిచ్చిన వాగ్దానాల మేరకు సంక్షేమ పథకాలు అమలు జేయడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమయిందని ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కలిగిరిలో జరిగిన పింఛన్ల పంపిణీలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైసీపీకి ఓటువేసి జగన్‌ను గెలిపించుకోవాలని కోరారు. అనంతరం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు.

హామీల అమలును మరచిన జగన్

లింగసముద్రం, జనవరి 8 : సీఎం జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలును మరచిపోయాడని కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు.సోమవారం రాత్రి లింగసముద్రంలోని 1వ వార్డులో మండల టీడీపీ అధ్యక్షుడు వేముల గోపాలరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంటూరి ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్, అర్థాకుల బాబు, అర్థాకుల పెదసత్యం, అర్థాకుల చినసత్యం, అడపా నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణంలోని కేసరిగుంట కాలనీలో సోమవారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముచ్చు శ్రీను, అత్తంటి రత్తయ్య, చుండూరి శ్రీను, కల్లూరి వెంకటేశ్వర్లు, ఉన్నం కొండలరావు, ఉప్పుటూరి విష్ణు, దామా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు కందుకూరులో నీటి సరఫరాకు అంతరాయం

కందుకూరు, జనవరి 8: పట్టణానికి తాగునీరందించే రామతీర్థం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద కొత్త మోటార్లు, కొత్త ప్యానల్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నందున 9,10 తేదీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఏయంసీ వాటర్‌ట్యాంకు, ఏరియా వైద్యశాల సమీపంలోని పంప్‌హౌస్‌ల నుంచి తాగునీటి సరఫరా జరిగే అన్నిప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోతుందన్నారు. బుధవారం పట్టణంలోని అన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

జాబ్ క్యాలెండర్ విడుదలకు వినతి



సబ్ కలెక్టరు విద్యాధరికి వినతిపత్రం అందజేస్తున్న తెలుగు యువత నాయకులు

కందుకూరు : ఈ ఏడాదైనా ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కందుకూరులో తెలుగు యువత నాయకులు సబ్ కలెక్టరు జి. విద్యాధరిని కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఏటా జాబ్ క్యాలెండరు విడుదల చేస్తానన్న మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన జగన్మోహన్‌రెడ్డి ఈ ఐదేళ్ల కాలంలో ఒక్కసారి కూడా జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా నిరుద్యోగ యువతను నట్టేట ముంచారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు సవిడిబోయిన వెంకటకృష్ణ, చుండూరి శ్రీను, పొడపాటి మహేష్, కామినేని అశోక్, షేక్ శతాక్షి తదితరులు పాల్గొన్నారు.

రేపు కావలిలో జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

కావలి, జనవరి8: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి నెల్లూరుజిల్లా బాల,బాలికల జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక బుధవారం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నగళ్ల శ్రీనివాసకిరణ్, కార్యదర్శి వాయిల శ్రీనివాసులు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. స్థానిక ఉదయగిరి రోడ్డులోని మినీ స్టేడియంలో ఆరోజు సాయంత్రం 3 గంటలకు ఎంపిక జరుగుతోందన్నారు. ఎంపికకు వచ్చే వారు 2004 ఫిబ్రవరి 4కి ముందు జన్మించి ఉండాలన్నారు. బాలురు 70 కేజీలు, బాలికలు 65 కేజీల లోపు బరువు ఉండాలన్నారు. ఆధార్ కార్డు, పదోతరగతి సర్టిఫికెట్ ఒరిజనల్ తీసుకుని రావాలన్నారు. ఎంపికైన జట్లు ఈనెల 20 నుంచి 23 వరకు నంద్యాలలో జరిగే కబడ్డీ పోటీల్లో పాల్గొనాల్సి ఉందన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా..

మర్రిపాడు, జనవరి 8: ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి సతీమణి శాంతికూమారిని టీడీపీ అధిష్టానం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించింది. దీంతో ఆమె టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జాతీయ కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చన్నాయుడుకు సోమవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో టీడీపీ గెలుపుకోసం తన కష్టపడి పనిచేస్తానని తెలిపారు.

వివేకానంద బోధనలపై అవగాహన ఉండాలి

కావలి రూరల్, జనవరి8: స్వామి వివేకానంద బోధనలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని లోక్‌అదాలత్ సభ్యుడు ఎం. మాలకొండారెడ్డి తెలిపారు. కావలి మండలం గౌరవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం వివేకానంద బోధనలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ వివేకానంద బోధనల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రమాదేవి, జ్యోతి కుమారి, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి

జలదంకి, జనవరి 8: జలదంకిలోని సర్వేనెంబరు 111 4-2బీలో 1.41 ఎకరాల భూమిని తాను కొంగర పద్దయ్య వద్ద కొనుగోలు చేశానని, అయితే ఆ భూమిని వేరే వ్యక్తికి రెవెన్యూ రికార్డులు మార్చి హక్కు కల్పించేందుకు యత్నిస్తున్నారని మహిళా రైతు పూనూరు వెంకట పద్మావతి పేర్కొన్నారు. తనకు న్యాయం చేయాలని సోమవారం డీటీకి భరత్‌కు వినతిపత్రం అందించారు. తన పేరుపై రెవెన్యూ రికార్డులు ఉన్నాయని, పట్టాదారు పాసుపుస్తకం కూడా మంజూరైందన్నారు.అయితే ఉన్నతాధికారులు మద్దూరుపాడుకి చెందిన చీకుర్తి వెంకట్రావు పేరుపై హక్కు కల్పించేందుకు యత్నిస్తున్నారని ఆమె వివరించారు. రికార్డులు మార్పులో జేసీ, కావలి ఆర్డీవో, జలదంకి తహసీల్దార్ల ప్రమేయం ఉన్నట్లు ఆమె ఆరోపించారు.

టీఆర్‌ఆర్‌లో గార్డెన్ల ప్రారంభం

కందుకూరు : స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వీసీ డాక్టరు ఎం. అంజిరెడ్డి సోమవారం ఫ్లవర్ గార్డెన్, ఫ్రూట్ గార్డెన్‌లను ప్రారంభించారు. అనంతరం ఆయన స్పాట్ వాల్యూయేషన్ సెంటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్, కేవీకే డైరెక్టరు ప్రసాద్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు. మహారాష్ట్రకు చెందిన గ్రీన్ వియో సొల్యూషన్స్ సంస్థ వారు, పట్టణానికి చెందిన వ్యాపారి పులకం నారాయణరావు పలు పూల, పండ్ల మొక్కలను బహూకరించారని ప్రిన్సిపాల్ తెలిపారు. మున్నంగి సీ ఫుడ్స్ యజమానులు రాజశేఖర్, రామారావు, పెరల్ డిస్టలరీస్ యాజమాన్యం తరపున మేనేజరు శ్రీనివాసరావులు గార్డెన్ల ఏర్పాటుకు తోడ్పాడ్డారని తెలిపారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి


అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న మంత్రి కాకాణి

పొదలకూరు, జనవరి 8 : విజయవాడలోని స్వరాజ్ మైదాన్‌లో రూ.404 కోట్ల వ్యయంతో 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరులో సోమవారం ఆయన పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ విగ్రహాన్ని ఈనెల 19వతేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం ఆయన పొదలకూరు తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డైట్ కళాశాలలో 'జన్ భగీదారి'

ఇందుకూరుపేట, జనవరి 8: మండలంలోని పల్లిపాడు డైట్ కళాశాలలో సోమవారం జన్ భగీదారి (ప్రజల భాగస్వామ్యం) కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న విజయవాడలో 125 అడుగులు ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని, అన్ని విద్యా సంస్థల్లో అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు సమర్పించి, విద్యార్థులకు వివిధ అంశాలలో పోటీలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అందులో భాగంగా డైట్ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల సమర్పించి, నివాళులు అర్పించామన్నారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు డాక్టర్ కే వెంకటేశ్వరరావు, ఉపన్యాసకులు డీ నర్సింగరావు, కే విజయచంద్ర, ఎస్‌బీదాస్, ఎన్ శివ, సీ.సోమేశ్వర్, కే షఫీ అహ్మద్ తదితరులు పాల్గొన్నారని ఆయన వివరించారు.

బుచ్చిరెడ్డిపాళెం : స్థానిక జొన్నవాడ రోడ్డు సెంటర్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి సోమవారం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, పలువురు కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈనెల 19 సీఎం జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా విజయవాడలో 125అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శివకుమార్‌రెడ్డి, ప్రమీలమ్మ, పలువురు వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మనుబోలులో ప్రతిజ్ఞ

మనుబోలు, జనవరి 8: స్థానిక వైఎస్ఆర్ క్రాంతిపథం కార్యాలయంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైఎస్ఆర్ కేపీ సిబ్బంది సోమవారం భారత రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఏపీఎం వనజాక్షి సంఘమిత్ర సభ్యులు, సీసీలచేత జన్‌భాగిదారి కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయించారు.

వీఎస్‌యూలో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు

● మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం, జనవరి 8 : విక్రమ సింహపురి యూనివర్సిటీలో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న యూనివర్సిటీలో సోమవారం సాయంత్రం వీసీ సుందరవల్లితో కలిసి నూతనంగా నిర్మించిన దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం యూనివర్సిటీలో సుమారు రూ.93 లక్షలతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోశయ్యకు నివాళి

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 8 : స్థానిక జొన్నవాడ సెంటర్‌లోని క్రామేడ్ చంద్రగిరి రోశయ్య స్మారక స్థూపం వద్ద సోమవారం ఆయన 18వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన పోరాటాలు, సేవలను పలువురు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో గండవరపు శ్రీనివాసులు, మల్లికార్జున, జానీబాష, పీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుస్తుల పంపిణీ

మనుబోలు, జనవరి 8: స్థానిక భవిత కేంద్రంలో ఉన్న (దివ్యాంగులు) చిన్నారులకు సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. హైస్కూల్ ప్లస్‌లో ఆంగ్ల ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వీవీ రమేష్ తన తల్లిదండ్రులు వెంకటశివరావు, జయప్రదమ్మ జ్ఞాపకార్థం, పండుగ కానుకగా 20 మంది చిన్నారులకు ఒక్కో జత దుస్తులు వితరణ చేయగా, ఎంఈవో శేషాద్రివాసు చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా రమేష్‌ను ఎంఈవో, హెచ్ఎం వసంతకుమారి, ఐఈఆర్‌టిలు షర్మిల, శ్యామల అభినందించారు.

అంగన్‌వాడీల నిరసన

తోటపల్లిగూడూరు, జనవరి 8: అక్క చెల్లెమ్మలంటూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నట్టేట ముంచాడని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని నరుకూరు సెంటర్‌లో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నెంబరు 2 ప్రతులను దహనం చేశారు. వీరికి సీపీఎం, సీఐటీయూ అనుబంధ సంఘాలు మద్దతు తెలిపారు. అనంతరం తోటపల్లిగూడూరు, ముత్తుకూరు మండలాల అంగన్‌వాడీల అధ్యక్షురాలు మస్తానమ్మ, గీతాదేవి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని, లేనియెడల ఓటుతో బుద్ధి చెబుతామని తెలిపారు.

'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి'

పొదలకూరు, జనవరి 8 : మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి కార్యక్రమాన్ని సోమవారం ఆ పార్టీ నాయకులు స్థానిక పంచాయతీ బస్టాండ్ ఆవరణలో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేయు పనుల గురించి ప్రజలకు వివరించి, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూల చంద్రశేఖర్, తిరుపతి జిల్లా ప్రెసిడెంట్ పంటా శ్రీనివాసులరెడ్డి, మండల ప్రెసిడెంట్ బి చెంచుబాబు, మహిళా కాంగ్రెస్ ప్రెసిడెంట్ ప్రమీల, వైస్ ప్రెసిడెంట్ మస్తాన్‌రెడ్డి, రత్నయ్య, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

టికెట్ ఎవరికి ఇచ్చినా విజయానికి కృషి చేస్తా

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్ యాదవ్

రాపూరు(డక్కిలి), జనవరి 8 : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వెంకటగిరి టీడీపీ టికెట్ ఎవరికి ఇచ్చినా వారి విజయానికి కృషిచేస్తానని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మస్తాన్ యాదవ్ అన్నారు. ఆయనను రాష్ట్ర కార్యదర్శిగా నియమించడంతో రాపూరులో సోమవారం ఆయన అనుచరులు కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మస్తాన్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిగా చూడాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. అంతకు ముందు మస్తాన్ యాదవ్ పెంచలకోన నృసింహస్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టీడీపీ నాయకులు తుమ్మలపల్లి మధుసూదనరావు, బత్తిన చంద్రశేఖర్ రెడ్డి, మంగళపూరి వెంకటేశ్వర్లు, వేమయ్య, ఎస్‌కే ఖాదర్ బాషా, గంగోడి ఆనంద్, నాగరాజు, ప్రణయ్, అక్బర్ తదితరులు వున్నారు.

ట్రాన్స్‌లేషనల్ రీసెర్చ్‌పై అవగాహన సదస్సు



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న వీసీ సుందరవల్లి

వెంకటాచలం, జనవరి 8: మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలోని బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ట్రాన్స్లేషనల్ రీసెర్చ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. టోనీ బ్రేక్ యూనివర్సిటీ (అమెరికా) డైరెక్టర్ ఆఫ్ ట్రాన్స్లేషనల్ రీసెర్చ్ పీ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి అవగాహన కల్పించారు. తాను చేపడుతున్న వివిధ పరిశోధనల గురించి ఆయన వివరించారు. అనం తరం శ్రీనివాస్ చేసి న పరిశోధనలను వీఎస్‌యూ వీసీ సుందరవల్లి ప్రశంసిస్తూ శ్రీనివా స్‌ను సత్కరించి మెమొంటోను అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ విజయానంద్‌కుమార్ బాబు, బయోటెక్నాల జీ విభాగాధిపతి డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ విద్యా ప్రభాకర్, డాక్టర్ ఎస్‌బీ సాయినాథ్, డాక్టర్ శ్రీకన్యారావు, డాక్టర్ టీ వీరారెడ్డి, డాక్టర్ వై విజయ, డాక్టర్ త్రివేణి, డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి, డాక్టర్ ఏ అనిల్‌కుమార్, డాక్టర్ పీ ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

ఘనంగా నేదురుమల్లి జన్మదినం

రాపూరు(డక్కిలి), జనవరి 8 : తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం రాపూరులో వైసీపీ సీనియర్ నాయకులు పాపకన్ను మధుసూదన రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెక్ కట్‌చేశారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పాలు, రొట్టెలు పంపిణీచేశారు. వైసీపీ నేతలు పాపకన్ను దయాకరరెడ్డి, నెల్లూరు రవీంద్రారెడ్డి, పట్టాభిరామిరెడ్డి, నారసింహారెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైదాపురం : మండల కేంద్రంలో సోమవారం వెంకటగిరి నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు మండల వైసీపీ అధ్యక్షుడు మన్నారపు రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు గోగినేని శివకుమార్ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

రాపూరు(డక్కిలి), జనవరి 8 : మండలంలోని సిద్దవరం గ్రామ ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు హెచ్ఎం సయ్యద్ షకీలా బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎంటిఎస్ ఉపాధ్యాయుడు షేక్ గౌస్ మొహిద్దిన్, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ యునైటెడ్ ఫోరం జిల్లా అధ్యక్షురాలు వి అరుణ, మండల అధ్యక్షురాలు వీ శాంతి, ఓరుపల్లి రాజా రత్నం, కుంచం వేమయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేలు, పశువైద్యశాలల సందర్శన

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలో పశువైద్యశాలలు, ఆర్‌బీకేలను ట్రైనీ కలెక్టర్ సంజనా సిన్హా సోమవారం పరిశీలించారు. పెనుబల్లి, రేబాలలోని పశువైద్యశాలలు, కాళయకాగొల్లులో ఆర్‌బీకేని పరిశీలించారు. అనంతరం బుచ్చి ప్రాంతీయ పశువైద్యశాలను సందర్శించారు. పలు రకాలు మందులు, దాణాలు పరిశీలించి, వాటి గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆర్‌బీకేలలో ఎరువులు, విత్తనాలు పరిశీలించారు. ఆమె వెంట ఏడీ యశోద, బుచ్చి ఏడీ ప్రసన్నాంజనేయరెడ్డి, రేబాల, పెనుబల్లి పశువైద్యులు తదితరులు ఉన్నారు.

అరుదైన శస్త్రచికిత్స విజయవంతం

నెల్లూరు(వైద్యం), జనవరి 8 : మెడికవర్ ఆసుపత్రిలో అరుదైన బ్రోంకోస్కోపిక్ క్రయో ఊపిరితిత్తుల బయాప్సీ శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఆసుపత్రిలో క్లినికల్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ కాటంరెడ్డి కౌషిక్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. తిరుపతి జిల్లాకు చెందిన రమాదేవి(34) కొంతకాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ మెడికవర్ ఆసుపత్రికి వచ్చిందన్నారు. బాధితురాలిని పూర్తిస్థాయిలో పరీక్షించగా ఊపిరితిత్తులు దెబ్బతిని ఊపిరితిత్తులకు పోయే నాళంలో గడ్డ ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ వ్యాధిని బ్రోంకోస్కోపిక్ క్రయో ఊపిరితిత్తుల బయాప్సీ ట్యూమర్‌గా గుర్తించామని చెప్పారు. ఈ నేపథ్యంలో బాధితురాలికి చికిత్స కష్టతరంగా ఉన్నప్పటికీ ఒక చాలెంజ్‌గా తీసుకుని ప్రాణాపాయం నుంచి కాపాడగలిగామన్నారు. కార్యక్రమంలో బాధితురాలు రమాదేవి, ఆమె తల్లి పాల్గొన్నారు.

తుఫాన్ పరిహారంలో సర్వేపల్లి ప్రజలకు అన్యాయం

● మంత్రి కాకాణిపై సోమిరెడ్డి ధ్వజం

మనుబోలు, జనవరి 8: తుఫాన్ పరిహారంలో సర్వేపల్లి ప్రజలకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్యాయం చేశాడని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని గురివిందపూడి గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. గ్రామ టీడీపీ నాయకులు సర్వేపల్లి శివకుమార్, చెన్నూరు సుధీర్‌రెడ్డిల ఆధ్వర్యంలో సోమిరెడ్డికి ఘన స్వాగతం పలికారు. హైవే నుంచి గ్రామం వరకు మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ తుఫాన్ పరిహారంలో సర్వేపల్లి ప్రజలకు మంత్రి అన్యాయం చేశాడని ఆరోపించారు. కాలువ మంజూరు చేయించి, టెండర్ పిలిచి పనులు ప్రారంభించింది టీడీపీ హయాంలోనే అన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటా కరపత్రాలు అందించి రాబోయే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాలి రామకృష్ణా రెడ్డి, పొన్నూరు రామకృష్ణయ్య, పచ్చిపాల రామిరెడ్డి, ఇసనాక విజయభాస్కర్ రెడ్డి, రాయపాటి కిరణ్‌కుమార్, మోమిడి ప్రసాద్, తాటిపర్తి హనుమ, సాని వెంకట రమణయ్య, సుధాకర్‌రెడ్డి, దందు చంద్రశేఖర్‌రెడ్డి, సునీల్, కృష్ణమనాయుడు, రాజాగౌడ్, చిట్టిబాబు, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అడుగు పేదల కోసమే.. : దినేష్ రెడ్డి


ర్యాలీలో టీడీపీ శ్రేణులు

కోవూరు, జనవరి 8: టీడీపీ అధినేత చంద్రబాబు వేసే ప్రతి అడుగు పేదల కోసమేనని ఆ పార్టీ కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని జమ్మిపాలెంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగు నింపేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఇంతా మల్లారెడ్డి కొల్లారెడ్డి, సుధాకర్‌రెడ్డి, యాకసిరి వెంకటరమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిలో టీడీపీ భారీ ర్యాలీ

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 8 : బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి టీడీపీ ఆధ్వర్యంలో స్థానిక జొన్నవాడ సెంటర్ నుంచి గాంధీవిగ్రహం సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. యువ నాయకుడు కాలంశెట్టి కిషోర్‌కుమార్ జన్మదినం సందర్భంగా నిర్వహించిన ఈ ర్యాలీలో ముందుగా కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న సీఐ, ఎస్‌ఐలు అక్కడికి చేరుకుని ర్యాలీని అడ్డుకునే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. ఈ ర్యాలీలో నాయకులు ఎంవీ.శేషయ్య, హరికృష్ణ, హరనాథ్, కొండయ్య, మహేష్, చక్కా మదన్ తదితరులు పాల్గొన్నారు.

పోలంరెడ్డి పరామర్శ

విడవలూరు, జనవరి 8: మండల పరిధిలోని విడవలూరులో ఇటీవల బద్వేలు వెంకట రమణమ్మ మృతి చెందారు. దీంతో ఆమె కుమారుడు బద్వేలు ప్రసాద్‌రెడ్డిని సోమవారం కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీనాయకులు చెముకుల కృష్ణ చైతన్య, పూండ్ల హరిరెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి తదితరులు ఉన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

నెల్లూరు(వైద్యం), జనవరి 8 : వైసీపీ నేత నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుధాకర్ నగరంలోని సాల్వేషన్ ఆర్మీ చర్చిలో కేక్ కట్ చేసి, పేదలకు అల్పాహారం, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సాల్వేషన్ ఆర్మీ చర్చి పాస్టర్ ప్రసాద్, మేరిగ్రేస్, తీపలపూడి రూబెన్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు


కేబీఆర్ పాఠశాలలో విద్యార్థుల వేషధారణ


ఓవెల్ పాఠశాలలో ముగ్గులు వేస్తున్న..



శేషు స్కూల్లో అలరించిన చిన్నారులు...


వైఎస్ఆర్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో భోగి మంటలు

నెల్లూరు(విద్య), జనవరి 8 : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు పాఠశాలల్లో సోమవారం ముందస్తు వేడుకలు నిర్వహించారు.

● మాగుంట లేఅవుట్‌లోని డాక్టర్ ఎస్ఆర్‌కే విశ్వసాయి పాఠశాలలో విద్యా ర్థులు గాలిపటాలు ఎగురవేశారు. గంగిరెద్దులు, హరిదాసులు, భోగిమంటలు, సంప్రదాయ నృత్యాలు అలరించాయి. ప్రీప్రైమరీ విద్యార్థులకు భోగిపండ్లు పోసి ప్రసాదం పంచిపెట్టారు. ఐదు నుంచి పదో తరగతి విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ సత్యనారాయణ, డైరెక్టర్ కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ రఘురామ్, తదితరులు పాల్గొన్నారు.

● నగరంలోని ఓవెల్ పాఠశాలలో సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా విద్యార్థులు భోగి మంటలు, రంగవల్లులు, గాలిపటాల కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సీఎండీ వేణు, సీఈఓ ప్రమీల, ఏజీఎం హర్ష, ప్రిన్సిపాల్ రవీ, సిబ్బంది, పాల్గొన్నారు.

● నగరంలోని బీవీనగర్ కేబీఆర్ పాఠశాలలో విద్యార్థులు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ విజయభాస్కర్‌రెడ్డి, బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

● నవాబుపేట రవీంద్రభారతి పాఠశాలలో భోగిమంటలు వేసి విద్యార్థులకు పండుగ విశిష్టతను తెలియచేశారు. అనంతరం బాలబాలికలు సంప్రదాయ దుస్తులతో చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి శ్రీహరి, డీన్ శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్ నిరుపమ, సిబ్బంది పాల్గొన్నారు.

● ధనలక్ష్మీపురం రత్నం సీబీఎస్ఈ పాఠశాలలో ప్రిన్సిపాల్ రాజేశ్వరి విద్యార్థులకు పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. బాలబాలికలు సాంప్రదాయ దుస్తులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

● బుజబుజనెల్లూరులోని శేషు ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కరస్పాండెంట్ శేషు ఆధ్వర్యంలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తెలియచేసేలా ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. అనంతరం పండుగ విశిష్టతను తెలియజేశారు. భోగిమంటలు, రంగవ ల్లులు, బొమ్మలకొలువు, గొబ్బెమ్మలతో చిన్నారులు సంబరాలు చేసుకున్నారు. విద్యార్థులు ఎరుకలసాని, పిట్టలదొర, బుడబుక్కలోడు, హరిదాసు వేషధారణలతో చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

● నగరంలోని మూలాపేట వాగ్దా పాఠశాలలో విద్యార్థులు సాంప్రదాయ వేషధారణలతో భోగి మంటలు వేసి గాలిపటాలు ఎగురవేశారు. బాలికలు వేసిన రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో కరస్పాం డెంట్ పక్కాల శ్రీనివాసులు, స్వరూపరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

● సరస్వతి నగర్‌లోని డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాలలో విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో చేసిన ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు, బాలురకు గాలిపటాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో జీఎం రామ్మూర్తి నాయుడు, మేనేజర్ అజయ్‌సింగ్, ఏఓ సునీల్, ప్రిన్సిపాళ్లు మణిమాల, ప్రపూర్ణ, జాస్మిన్, నాగేంద్ర పాల్గొన్నారు.

● కొండాయపాళెం నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. విద్యార్థులు సాంప్రదాయ పద్ధతుల్లో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఎం భాస్కర్‌రావు, ఎస్‌సీసెల్ అధ్యక్షుడు తాళ్లూరి సురేష్‌బాబు, పద్మాయాదవ్, రమాదేవి, రాజా, గోపాల్‌రెడ్డి, రసూల్, నాగేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు హరీష్, రాశి పాల్గొన్నారు.

నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలోని వైఎస్ఆర్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో బాలభవన్ డైరెక్టర్ జి.సుభద్రాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. రంగవల్లులు, భోగిమంటలు వేశారు. పిండివంటలు, అరిసెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం.లక్ష్మయ్య, ఉపాధ్యాయులు సి.మాధవి, శిరీష, సిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే సుపరిపాలన సాధ్యం

● మాజీ మంత్రి నారాయణ


వ్యాపారులతో నారాయణ, కోటంరెడ్డి

నెల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో సుపరిపాలన తెలుగుదేశం ప్రభుత్వంతోనే సాధ్యమని మాజీ మంత్రి, టీడీపీ సిటీ ఇన్‌చార్జి పొంగూరు నారాయణ అ న్నారు. సోమవారం నగరంలోని 44, 46, 47 డివిజన్లలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ, దుకా ణం వద్దకు వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నెల్లూరు నగరాన్ని అభివృద్ధి చేసింది నారాయణేనన్న విషయం ప్రజలందరికీ తెలుసునన్నారు. అలాగే సోమవారం రాత్రి 13వ డివిజన్ మిట్టపాళెంనూ నారాయణ పర్యటించారు. బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, గుడి ఏడుకొండలు, మహేంద్ర, మణి, దశరథరామిరెడ్డి, సత్యనాగేశ్వరరావు, గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

కాపు సంక్షేమ సేన సమావేశానికి హాజరుకండి

నెల్లూరు(క్రైం) : త్వరలో జరగనున్న కాపు సంక్షేమ సేన జిల్లాస్థాయి సమావేశానికి హాజరుకావాలని కాపు సంక్షేమసేన జిల్లా అధ్యక్షుడు బెల్లపు సుధామాధవ్ మాజీమంత్రి పీ.నారాయణను కలిసి ఆహ్వానించారు. త్వరలో కాపు సంక్షేమ సేన జిల్లాస్థాయి సమావేశం తేదీని ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, కొణిదల సందీప్, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానపు రోడ్లను బాగు చేయించండి


వినతిపత్రం సమర్పించి మాట్లాడుతున్న కోటంరెడ్డి

నెల్లూరు (హరనాథపురం) : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న రోడ్లను బాగు చేయించాలని కోరుతూ టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సోమవారం కలెక్టరేట్‌లో జరిగి న స్పందనలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములుమూడి-తాటిపర్తి, గొల్లకందుకూరు-సజ్జాపురం రోడ్లకు టెండర్లు పిలిచి 5 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదన్నారు. ఈ రోడ్ల గుండా కొత్త వెల్లంటి, గొలకందుకూరు, కందమూరు, సజ్జాపురం పోవాలంటే ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారన్నారు.

టెన్త్ విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్ల పంపిణీ

నెల్లూరు(విద్య), జనవరి 8 : బీవీఎస్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో సోమవారం మహాయాగ ఫౌండేషన్ హెల్పింగ్ సొసైటీ, బెంచ్‌మార్క్స్ సివిల్ ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ సంయుక్త ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లోకేష్‌కుమార్, మీరావలి, రఫీ, వినయ్‌కుమార్‌చౌదరి, యూటీఎఫ్ నేతలు అచ్చయ్య, మధుసూదన్‌రావు, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధ మహోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం) : నగరంలోని చిన్నబజార్ ఖాజాపీర్ సాహెబ్ పెద్ద దర్గా గంధ మహోత్సవం సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో జరిగింది. గంధం బిందెలను ఖ్వాజా ఫీర్ మఖాన్ నుంచి ఫకీర్ జరబ్‌లు విన్యాసాలతో ఊరేగింపుగా బయలుదేరి దర్గాకు చేరింది. మత పెద్దలు, పవిత్ర గంధంను షిహాదులకు లేపనం చేసి కొత్త గలీబులు కప్పారు. అనంతరం భక్తులకు గంధం ప్రసాదంగా పంచిపెట్టారు. దర్గా పెద్దలు పర్యవేక్షించారు.

చంద్రశేఖరేంద్ర సరస్వతి ఆరాధన

నెల్లూరు(సాంస్కృతికం) : పొగతోటలో ఉన్న ఆదిశంకర ధ్యాన మందిరంలో సోమవారం రాత్రి నడిచే దైవం కంచి పరమాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి ఆరాధన వేడుకలు జరిగాయి. జంగా శివకుమార్, మేనేజర్ చక్రాల వెంకటలక్ష్మీనరసింహం పాల్గొన్నారు.

ఓబీసీ స్థితిగతులపై అంచనా వేయండి : బీద

నెల్లూరు(హరనాథపురం) : ఇతర వెనుక బడిన తరగతుల(ఓబీసీ)సంక్షేమ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షులు, రాజ్యసభసభ్యులైన హరినాథ్ సింగ్‌యాదవ్‌ను రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు సోమవారం చైన్నైలో కలిశారు. మస్తాన్‌రావు మాట్లాడుతూ ఓబీసీల సంక్షేమానికి కులగణన చేపట్టాలని, ఓబీసీల స్థితిగతులపై అంచనా వేయాలని కోరారు. బీదతోపాటు తమిళనాడు యాదవ మహాసభ అధ్యక్షుడు ఎన్‌జే రామచంద్రన్‌యాదవ్, ద్రవిడ దేశం అధ్యక్షులు కృష్ణారావుయాదవ్‌లు హరినాథ్ సింగ్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి : కమిషనర్


అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ వికాస్

నెల్లూరు(సిటీ), జనవరి 8 : నగర వాసుల నుంచి స్పందనలో అధికారులకు అందిన ప్రతి అర్జీని పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎన్ఎంసీ కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ అర్జీలను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలన్నారు. ఒక్కసారి వచ్చిన సమస్య పదేపదే రాకూడదని స్పష్టం చేశారు. పారిశుధ్య పనులపై అధికారులు పర్యవేక్షించి ప్రజలకు ఇబ్బందులు రానివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అంబేడ్కర్‌ను స్మరించుకోవడం శుభపరిణామం

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 8 : ప్రపంచ మేధావి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను స్మరిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా వేడుక చేసుకోవడం గొప్ప శుభపరిణామమని నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పెర్నేటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. జన్ భగిదారీ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఉపాధ్యక్షుడు ఒట్టూరు సుధాకర్‌యాదవ్, డైరెక్టర్లు రామలింగారెడ్డి, శిరిషా జగదీశ్వరరెడ్డి, తాడిపత్రి వెంకటేష్, స్వర్ణప్రసాద్, మార్కెట్ కార్యాలయ యుడీసీ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

● నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచాలని నెల్లూరు ఏఎంసీ ఛైర్మన్ పేర్నాటి కోటేశ్వరరెడ్డి సూచించారు. సోమవారం ఏసీ కూరగాయల మార్కెట్, కోనేరు మార్కెట్‌ను పరిశీలించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లూరు(హరనాథపురం), జనవరి 8 : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను సోమవారం జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అసోసియేషన్ నాయకుడు బొబ్బల మురళి, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

నెల్లూరురూరల్, జనవరి 8 : నెల్లూరురూరల్ ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి లబ్ధిదారులకు నూతనంగా పెంచిన పింఛన్లను పంపిణీ చేశారు. ముందుగా బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆడుదాం ఆంధ్ర క్రీడాకారులకు ఆట వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయకుమార్, విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వేదగిరి క్షేత్రం ఛైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఎంపీడీవో శైలేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు ఎన్నికల కో ఆర్డినేటర్‌గా 'ఉడతా'

నెల్లూరు(వైద్యం), జనవరి 8 : ఒంగోలు పార్లమెంట్ ఎన్నికల కో ఆర్డినేటర్‌గా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావు యాదవ్‌ను సోమవారం పార్టీ అధిష్ఠానం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.


ఎస్సీ, ఎస్టీ ఈఏ జేఏసీకు సన్మానం

నెల్లూరు(హరనాథపురం), జనవరి 8 : ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శిగా నియమితులైన కల్లూరి ప్రభాకర్‌ను నగరంలోని మోడల్ హైస్కూల్‌లో సోమవారం ఉద్యోగ, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మోడల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్.శ్రీనివాసులు, సహోద్యోగులు పీవీ నారాయణరావు, సీహెచ్ జయప్రకాష్‌బాబు, టి.వెంకటేశ్వర్లు, డి.పెంచలరెడ్డి, ఎం.మల్లీశ్వరి, ఎస్‌కే షబీనా, డి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు నాగేంద్ర ఎంపిక

నెల్లూరు(విద్య), జనవరి 8 : రాజస్థాన్‌లోని బికనీర్‌లో ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు జరగనున్న 67వ జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు నగరంలోని వేదసంస్కృత పాఠశాల పదో తరగతి విద్యార్థి పి.నాగేంద్ర ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్ఆర్.శర్మ తెలిపారు. సోమవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పి.ప్రభాకర్‌రావు, అధ్యక్షుడు సీహెచ్.రామ్మూర్తి, పీఈటీ ఎం.చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.


ఆవేదనతో పెట్రోలు పోసుకుంటూ...


ఆక్రోశంతో మాట్లాడుతూ...



పోలీసు నిర్బంధంలోనూ సడలని స్థైర్యం


ఆస్పత్రిపాలై అచేతనంగా



న్యాయం కోసం నినాదం


ఆర్డీవో ఆఫీసు ముందు టీడీపీ దీక్షా శిబిరం వద్దకు చేరిన వైసీపీ శ్రేణులు

దొంగ ఓట్లను తొలగిస్తారా? లేదా?

- చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లను తొలగించాలంటూ దీక్ష చేపట్టిన విపక్షం
- పోటీగా దీక్షకు దిగిన వైసీపీ శ్రేణులు

పోలీసుల తీరును నిరసిస్తూ ఒంటిపై పెట్రోల్ పోసుకున్న పులివర్తి నాని ● అస్వస్థతకు గురవడంతో స్విమ్స్‌లో చికిత్స


తెలుగు మహిళల అరెస్టు

తిరుపతి (రవాణా), జనవరి 8: చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో దొంగ ఓట్లను ఎప్పుడు తొలగిస్తారని టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని ప్రశ్నించారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ఉదయం దొంగ ఓట్లను తొలగించాలంటూ ఆయన నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పులివర్తి నాని మీడియాతో మాట్లాడుతూ ఆర్డీవో నుంచి కలెక్టర్, ఎన్నికల కమిషన్ దాకా దొంగ ఓట్లను తొలగించాలని వందలాది వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి న్యాయం జరగలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు బీఎల్వోలకు షోకాజ్ నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి కనుసన్నల్లోనే ఈ తతంగమంతా జరిగిందని ఆరోపించారు. ఇప్పటికైనా ఈసీ అధికారులు చొరవ తీసుకుని దొంగ ఓట్లను పూర్తిగా తొలగించడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.నానీకి మద్దతుగా నియోజకవర్గపరిధిలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున నిరాహార దీక్షలో పాల్గొన్నారు.దొంగ ఓట్లు తొలగించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ నినాదాలు చేశారు. చంద్రగిరి నియోజకవర్గ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం నాయుడు, గౌస్‌బాషా, మధు, హేమాంబరధరరావు, ఈశ్వరయ్య, పెరుగు భాస్కర్‌రెడ్డి,సింగ్ సుధ, మహేశ్వరి,సురేష్ నాయుడు, బిరుదాల భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.కాగా నాని చేపట్టిన దీక్షకు తిరుపతి టీడీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, కృష్ణయాదవ్, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, రవి మనోహరాచారి తదితరులు మద్దతు తెలిపారు.

టీడీపీ దీక్షను నీరుగార్చేందుకు రంగంలోకి వైసీపీ

ఉదయం 11గంటల ప్రాంతంలో ప్రారంభమైన దీక్షను జోరువానలోనూ పులివర్తి నాని కొనసాగించారు. దీక్షకు పెద్దఎత్తున మద్దతు లభించడం, నియోజకవర్గంలో చర్చనీయాంశం కావడంతో వైసీపీ అప్రమత్తమైంది.టీడీపీ దీక్షను ఎలాగైనా నీరుగార్చాలన్న ఉద్దేశంతో తిరుపతి రూరల్ ప్రాంతంలోని అవిలాల సర్పంచ్ సీవీ రమణ, పేరూరు సర్పంచ్ దామినేటి కేశవులు, మల్లంగుంటకు చెందిన వైసీపీ నేత రామచంద్రయ్య, వేదాంతపురానికి చెందిన ప్రేమ్‌కుమార్, సి.మల్లవరానికి చెందిన మల్లారపు వాసు, గాంధీపురానికి చెందిన మన్నూరు శివ, సెల్వం తదితరులు మధ్యాహ్నం 2.15గంటల ప్రాంతంలో ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకుని టీడీపీ దీక్ష శిబిరం పక్కనే దీక్ష చేపట్టారు.టీడీపీ తరపున దొంగ ఓటర్లను తొలగించాలంటూ నినాదాలు చేస్తే దళితుల ఓట్లను తొలగించిన టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలంటూ వైసీపీ శ్రేణులు నినాదాలు చేశాయి. దీంతో ఆర్డీవో కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.డీఎస్పీలు యశ్వంత్, సురేంద్ర రెడ్డి, సీఐలు అబ్బన్న, శివప్రసాద్‌రెడ్డి, జయనాయక్, ఎస్ఐలు సిబ్బందితో రంగప్రవేశం చేసి వైసీపీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం టీడీపీ నాయకులను, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. దీక్ష విరమించాలని లేకపోతే అరెస్టు చేయాల్సి వస్తుందని నానీకి చెప్పడంతో తాను శాంతియుతంగా దీక్ష చేస్తున్నానని చెప్పారు.దీక్ష విరమించబోనని అవసరమైతే ఆత్మహత్యకు సిద్ధమవుతానని చెప్పి పెట్రోలు ఒంటిపై పోసుకున్నారు. దీంతో మరింత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వెంటనే కొందరు కార్యకర్తలు సైతం ఒంటిపై పెట్రోల్ పోసుకున్నారు. గమనించిన పోలీసులు పెట్రోల్ క్యాన్‌ను పక్కకు లాగేసి మంచినీళ్లు పోశారు.ఆయన్ను పోలీసులు అదుపులోకి తీసుకుని తిరుచానూరులో ఇంటివద్ద వదిలిపెట్టారు. పెట్రోల్ ఒంటిపై పోసుకున్న సమయంలో కళ్లలో పడటంతో నాని అస్వస్థతకు గురయ్యారు.దీంతో పార్టీ శ్రేణులు స్విమ్స్ ఆస్పత్రికితరలించారు.అక్కడ డాక్టర్లు ఆయనకు వైద్యం అందించి భయపడాల్సిన అవసరం లేదన్నారు.స్విమ్స్‌లో నాని చేరిన విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున స్విమ్స్‌కు తరలివచ్చారు.


వైసీపీ శ్రేణుల అరెస్టు

నారాయణస్వామికి ఎదురుగాలి

- ఆయనకు టికెట్ ఇస్తే ఓడిస్తామంటున్న వ్యతిరేకవర్గం
- ఆయనే కావాలంటున్న అనుకూల వర్గం
- వైసీపీలో ఇన్‌చార్జుల మార్పు నేపథ్యంలో పెరిగిన వేడి

జీడీనెల్లూరు పాలిటిక్స్

చిత్తూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వైసీపీ చాలాచోట్ల ఎమ్మెల్యేలను పోటీ నుంచి పక్కకు తప్పిస్తోంది. జిల్లాలో ఇప్పటికే పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు ఆ పార్టీ అధిష్ఠానం టికెట్ నిరాకరించిన విషయం.. చిత్తూరులోనూ ఆరణి శ్రీనివాసులును మారుస్తున్నట్లు జరుగుతున్న ప్రచారం తెలిసిందే. మరోవైపు రాష్ట్రంలోని పలు నియోజక వర్గాల్లో ఎమ్మెల్యేల స్థానంలో కొత్తగా ఇన్‌చార్జులను నియమిస్తోంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం, జీడీనెల్లూరు ఎమ్మెల్యే నారాయణస్వామిని కూడా మార్చాలంటూ అక్కడ సొంత పార్టీ నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సోమవారం పెనుమూరు మండలం పులిగుండు శివాలయం వద్ద నారాయణస్వామి వ్యతిరేక వర్గం సమావేశమై నారాయణస్వామికి టికెట్ వద్దని, కొత్త అభ్యర్థిని ప్రకటిస్తే గెలిపించుకుంటామని తీర్మానించారు. నియోజకవర్గంలో ముందు నుంచీ జ్ఞానేంద్రరెడ్డి వర్గం వ్యతిరేకంగా ఉన్నప్పటికీ.. రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థుల మార్పులు చేర్పుల నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. పెనుమూరు మండలానికి చెందిన మాజీ ఎంపీ, ఎన్ఆర్ఐ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డికి, డిప్యూటీ సీఎం నారాయణస్వామికి తొలి నుంచీ పడటంలేదు సమయం దొరికినప్పుడల్లా పరస్పరం విమర్శలు చేసుకుంటున్నారు. ఆ మధ్య పెనుమూరు మండల సర్వసభ్య సమావేశానికి నారాయణస్వామి వస్తున్నారని తెలిసి.. మొదలైన 5 నిమిషాలకే జ్ఞానేంద్రరెడ్డి వర్గమైన ఎంపీపీ హేమలత సమావేశాన్ని ముగించారు. గడప గడపలో భాగంగా జ్ఞానేంద్రరెడ్డి, ఎంపీపీల సొంత గ్రామమైన గుంటిపల్లెకు డిప్యూటీ సీఎం వస్తుండగా రోడ్డుకు అడ్డంగా ముళ్ల కంచె వేసి అడ్డుకున్నారు. ఇటీవల పెనుమూరులో జరిగిన పెంచిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి నారాయణస్వామి హాజరయ్యారని ఎంపీపీ హేమలత, జడ్పీటీసీ దొరస్వామి సహా మరికొందరు నాయకులు గైర్హాజరయ్యారు. ఇటీవల జీడీనెల్లూరు టికెట్ మళ్లీ నారాయణస్వామికే అని ఆయన అనుచరులు పెనుమూరులో టపాసులు పేల్చి సంబరాలు జరుపుకొన్నారు. వెంటనే మరుసటిరోజు జ్ఞానేంద్రరెడ్డి వర్గమైన దయాసాగర్ రెడ్డి మరికొందరు తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డిని కలిసి స్వామికి టికెట్ ఇవ్వద్దంటూ కోరారు. అలాగే సజ్జలతోనూ తమ అభ్యంతరాన్ని వివరించినట్లు తెలిసింది.



నారాయణస్వామి వద్దు అని ప్లకార్డులు చూపుతున్న వైసీపీ నాయకులు

'ముద్దు.. వద్దు..' అంటూ పరస్పర సమావేశాలు

నారాయణస్వామి వద్దంటూ సోమవారం పులిగుండు శివాలయం వద్ద జ్ఞానేంద్రరెడ్డి వర్గం సమావేశమై తీర్మానించింది. ఆయనకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించింది. మరోవైపు నారాయణస్వామి కావాలంటూ ఆయన అనుకూల వర్గం కూడా ప్లకార్డులు చూపుతూ మీడియా సమవేశం నిర్వహించారు. దీనిపై మంగళవారం సమావేశం కానున్నట్లు సమాచారం.


అంగన్వాడీ ఉద్యోగులతో కలిసి నినదిస్తున్న నారాయణ, మురళి తదితరులు

వర్షానికీ వెరవని అంగన్వాడీలు

సమ్మెలో భాగంగా జోరుగా ఆందోళనలు, నిరసనలు

తిరుపతి, చంద్రగిరిల్లో సీపీఐ నారాయణ సంఘీభావం

తిరుపతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గడచిన 28 రోజులుగా సమ్మెలో వున్న అంగన్వాడీ ఉద్యోగులు జోరువానకూ వెరవకుండా సోమవారం జిల్లావ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలూ కొనసాగించారు. నాయుడుపేటలో అంగన్వాడీ చిన్నారులకు కాలకృత్యాలు శుభ్రపరుస్తూ ఉద్యోగులు వినూత్న రీతిలో ప్రభుత్వానికి నిరసన తెలియజేశారు. కోట మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగించిన సిబ్బంది ఎస్మా జీవో ప్రతులు తగులబెట్టారు. చంద్రగిరిలో వర్షం పడుతున్నప్పటికీ లెక్కచేయకుండా కార్యకర్తలు, సహాయకులు ర్యాలీ నిర్వహించగా సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పాల్గొని వారికి సంఘీభావం ప్రకటించారు.అంగన్‌వాడీ వర్కర్లపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు.ఎస్మా చట్టాన్ని మర్డర్లు చేసేవారిపైనో, ఎర్రచందనం స్మగ్లర్లపైనో, ఖూనీకోర్లపైనో, మైనింగ్ మాఫియాపైనో పెట్టాలే తప్ప అంగన్‌వాడీ వర్కర్లపై కాదన్నారు.తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో రిలే నిరాహార దీక్షలు కొనసాగించిన వర్కర్లు, హెల్పర్లు వర్షంలోనే మానవహారం నిర్మించారు. ఇక్కడ కూడా సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పాల్గొని మద్దతు ప్రకటించారు.ఎస్మా ప్రయోగానికి భయపడవద్దంటూ ఉద్యోగులకు ధైర్యం చెప్పారు. గూడూరు, వెంకటగిరి, సూళ్ళూరుపేట, శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరు, పిచ్చాటూరు తదితర చోట్ల ఓవైపు వర్షం కురుస్తున్నా గొడుగులు పట్టుకుని అంగన్వాడీ ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు.

ముగ్గురు వైసీపీ నేతలపై క్రిమినల్ కేసు

- నకిలీ సర్టిఫికెట్లతో గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు
- వీరిలో ఇద్దరు కార్పొరేటర్లు... మరొకరు మహిళా నేత

తిరుపతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గతేడాది జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తిరుపతికి చెందిన ముగ్గురు వైసీపీ నాయకులు నకిలీ సర్టిఫికెట్లతో గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదయ్యారు. వీరి సర్టిఫికెట్లు నకిలీవని తేలడంతో క్రిమినల్ కేసు నమోదైంది.గతేడాది మార్చిలో రాయలసీమ తూర్పు నియోజకవర్గ పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 8వ డివిజన్ కార్పొరేటర్ మునిరామిరెడ్డి, 12వ డివిజన్ కార్పొరేటర్ ఎస్కే. బాబు, కొర్లగుంటకు చెందిన వైసీపీ నాయకురాలు విజయ ఓటర్లుగా నమోదయ్యారు. అయితే వీరు పట్టభద్రులు కాదని అప్పట్లో టీడీపీ పరిశీలకులుగా వ్యవహరించిన ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు వీరిపై తిరుపతిలో రెవిన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే రాష్ట్ర పార్టీ నేతల దృష్టికి తీసుకెళ్ళారు. దీనిపై టీడీపీ రాష్ట్ర కార్యాలయం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదులపై స్పందించిన రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఓటర్లుగా నమోదయ్యేందుకు ముగ్గురు వైసీపీ నాయకులు సమర్పించిన సర్టిఫికెట్లు నిజమైనవేనా అని విచారణ నిర్వహించగా అవన్నీ ఫేక్ సర్టిఫికెట్లని తేలింది. దీంతో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో వైసీపీ నాయకులు వనజ, మునిరామిరెడ్డి, ఎస్కే. బాబులపై క్రైమ్ నంబరు 157-2023 పేరిట క్రిమినల్ కేసు నమోదైంది. ఐపీసీ సెక్షన్ 171 డి, అలాగే ప్రజాప్రాతినిధ్య చట్టం 1950 సెక్షన్ 31 కింద ఈ కేసు నమోదైంది. అయితే జిల్లా అధికార యంత్రాంగం ఈ విషయాన్ని గోప్యంగా వుంచింది. తాజాగా 2024 సార్వత్రిక ఎన్నికలకు చేపట్టిన ఓటర్ల జాబితా సవరణల్లో పెద్దఎత్తున అవకతవకలు జరుగుతున్నాయని టీడీపీ కార్యాలయం నుంచీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెళ్ళిన సంగతి తెలిసిందే. ఆ ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు వివరిస్తూ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి టీడీపీ కార్యాలయానికి సోమవారం పంపిన లేఖలో ఈ అంశాన్ని ప్రస్తావించడంతో సుమారు ఆరు నెలలు ఆలస్యంగా వైసీపీ నేతలపై కేసు నమోదైన సంగతి వెలుగు చూసింది.బాధ్యత కలిగిన డివిజన్ కార్పొరేటర్లుగా ప్రజాప్రతినిధులుగా వ్యవహరిస్తూ తప్పుడు విద్యార్హతల సర్టిఫికెట్లు సమర్పించి పట్టభద్రులమని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లుగా పేర్లు నమోదు చేయించుకోవడం పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

తిరుపతి(ఆటోనగర్) జనవరి 8: సంక్రాంతి పండుగ సందర్భంగా రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే తిరుపతి-సికింద్రాబాదు-కాకినాడ మధ్య ప్రత్యేక రైళ్లు (07055-07072-02707) నడపనున్నట్లు సీపీఆర్ఓ సీహెచ్ రాకేష్ తెలిపారు. ఈ రైళ్లు ఈ నెల 10, 14, 15 తేదీలలో రాకపోకలు సాగిస్తాయన్నారు.

ఎంతమందిని మార్చినా గెలుపు టీడీపీదే: పాశం



సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 8: వైసీపీ ఎంతమంది ఇన్‌చార్జీలను మార్చినా రానున్న ఎన్నికల్లో గెలిచేది టీడీపీనేనని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అబద్ధపు హామీలు చెప్పి అధికారం చేపట్టి అందరినీ మోసం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చి 57 నెలలు గడుస్తున్నా ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదని, పచ్చని రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే, యువత భవితను చీకట్లోకి నెట్టేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ రాష్ట్రాన్ని సంక్షోభ రాష్ట్రంగా మార్చివేశారని, వైసీపీ పాలనలో అన్ని రంగాల్లో రాష్ట్రం వైఫల్యం చెందిందన్నారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే అమరావతిని రాజధానిగా తీర్చిదిద్దుతారన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్ కుమార్, గుండాల లీలావతి, రాజేంద్ర, నాజరుద్దీన్, అల్లీహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఊనుగుంటపాళెంలో ఇంటింటికీ టీడీపీ



ఊనుగుంటపాళెంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కోట, జనవరి 8: మండల పరిధిలోని ఊనుగుంటపాళెంలో సోమవారం రాత్రి ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం జరిగింది. టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వాకా విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రంలో రాక్షసపాలన పోవాలంటే టీడీపీని గెలిపించి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిని చేయాలన్నారు. గూడూరు నుంచి పాశం సునీల్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలంటూ కోరారు.

జగన్‌ను ప్రజలే నమ్మడంలేదు: టీడీపీ

వెంకటగిరి, జనవరి 8: ప్రజా వ్యతిరేకత అంటూ వైసీపీ ఎమ్మెల్యేలను మార్చుతున్నారని, అయితే ముఖ్యమంత్రి జగన్‌ను ప్రజలు నమ్మడంలేదని టీడీపీ నాయకుడు పులికొల్లు రాజేశ్వరావు అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల జగన్ పాలనలో రాష్ట్రంలో అక్రమాలు, అరాచకాలు, అవినీతి మినహా అభివృద్ధి శూన్యమేనన్నారు. సంక్షేమం అంటూనే ప్రజలను దోచుకొంటున్నారని, మద్య నిషేధం అని చెప్పి నాసిరకం బ్రాండ్లు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ తన సొంత కజానా నింపుకొంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆయన వెంట కేవీకే ప్రసాద్ నాయుడు, శ్రీరామదాసుగంగాధర్, కాపా శ్రీనివాసులు నాయుడు, తాండవ చంద్రారెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, జనవరి 8: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఆక్సెంచర్ సంస్థ సోమవారం ప్రాంగణ ఎంపికలను నిర్వహించింది. 70 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కాగా, ఇందులో కంప్యూటర్ సైన్స్ విభాగం నుంచి 35 మంది, ఈసీఈ నుంచి 24 మంది, ఎఐ అండ్‌డీఎస్ నుంచి 7మంది, ఐటీ విభాగం నుంచి 4 మంది చొప్పున ఉన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్ రెడ్డి, ప్రాంగణ ఎంపికల అధికారి ఎస్.కిషొందర్, ఆయా విభాగాధిపతులు అభినందించారు.

పేదలకు దుస్తుల పంపిణీ



గూడూరు, జనవరి 8: స్థానిక బాలాజీనగర్‌లోని ప్రగతిసేవాసంస్థ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం పేదలకు దుస్తులు, ఆహారపొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రామ్మోహన్‌రావు, ప్రభాకర్, రాము, శివకుమార్, కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు..

కోట, జనవరి 8: కోట పంచాయతీ కార్యాలయంలో సోమవారం దాతల సహకారంతో షిరిడీసాయి అక్షయ సేవాసమితి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. హైదరాబాదుకు చెందిన చలంచర్ల ప్రభాకర్‌రావు జ్ఞాపకార్థం ఆయన కుమారులు సుబ్రహ్మణ్యం కుమార్, వేణుగోపాల్ దాతృత్వంతో పారిశుధ్య కార్మికులకు దుప్పట్లను షిరిడీసాయి అక్షయ సేవాసమితి అధ్యక్షులు అల్లం రమణయ్య, సర్పంచు వెంకటరమణమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు చేతులమీదుగా పారిశుధ్య కార్మికులకు దుప్పట్లను అందజేశారు.

జగన్‌ను కలిసిన రాంకుమార్ రెడ్డి



వెంకటగిరిటౌన్, జనవరి 8: వైసీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి సీఎం జగన్‌ను సోమవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 5వ తేదీ నిర్వహించిన సామాజిక సాధికార యాత్ర, నియోజకవర్గ పరిస్థితి గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. చేనేత సమస్యలపై రూపొందించిన మెమొరాండంను సీఎం అందజేశారు.

అధ్యాపకుడికి సన్మానం

నాయుడుపేట, జనవరి 8: నాయుడుపేట బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో భౌతిక శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న కదూరు మోహన్‌రాజును సోమవారం సన్మానించారు. సాంఘిక సంక్షేమ గురుకులాల ఉద్యోగ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా మోహన్‌రాజు నియమితులైన సందర్భంగా పలువురు అభినందించారు. ప్రిన్సిపాల్ మల్లిఖార్జున, నాగేశ్వర రావు, రవీంద్రబాబు, రాజశేఖర్, శేఖర్‌బాబు, వెంకటకృష్ణయ్య, వెంకటరమణయ్య, కస్తూరయ్య తదితరులు పాల్గొన్నారు.



మోహన్‌రాజును సన్మానిస్తున్న అధ్యాపకులు

గంజాయి స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్‌ఈబీ అధికారులు

సూళ్లూరుపేట, జనవరి 8: పట్టణంలోని హోలీక్రాస్ కూడలి వద్ద 3 కిలోల గంజాయిని ఎస్‌ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్ర తిరువళ్లూరుకు చెందిన మహమ్మద్‌బాబు బ్యాగుతో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో ఎస్‌ఈబీ అధికారులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా గంజాయి లభ్యమైంది. ఒడిశాలో ఉన్న చెందిన సురేష్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి తమిళనాడుకు తీసుకెళ్తున్నట్లు మహమ్మద్‌బాబు విచారణలో వెల్లడించినట్లు ఎస్‌ఈబీ సీఐ సూర్యనారాయణ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ శశికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడొద్దు

పెళ్లకూరు, జనవరి 8: సంక్రాంతి పండుగ సందర్భంగా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడరాదని ఎస్‌ఐ శ్రీకాంత్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కోడిపందేలు, పేకాట, బెట్టింగ్ నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో మద్యం విక్రయాలు జరిపితే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

ఓట్ల కోసం వస్తారు... సమస్యలు పట్టించుకోరా?

- రోడ్లు, డ్రైనేజీ అధ్వానం, తాగునీటికీ ఇబ్బందులు
- మిచౌంగ్ తుఫాన్ పరిహారమూ అందలేదు
- రోడ్డుపై బైఠాయించి లోతువానిగుంట కాలనీవాసుల నిరసన



రోడ్డుపై ఆందోళన చేస్తుతన్న లోతువానిగుంట కాలనీవాసులు

నాయుడుపేట టౌన్, జనవరి 8: ఓట్ల కోసం మాత్రం వస్తారు... కానీ మా సమస్యలు ఎవరూ పట్టించుకోరా అంటూ మండలంలోని లోతువానిగుంట కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నాయుడుపేట - పాత వెంకటగిరి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో కనీసం తాగునీరు కూడా సక్రమంగా సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు, డ్రైనేజీ అధ్వానంగా ఉన్నాయన్నారు. ఇటీవల సంభవించిన మిచౌంగ్ తుఫాన్‌లో ఇళ్లల్లోకి నీరుచేరి నానాకష్టాలు పడితే అధికారుల పలకరింపు కూడా కరువైందన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.2,500, ఉచిత బియ్యం ఇప్పటికీ అందలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు గంటసేపు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ ఆగిపోవడంతో ఎస్‌ఐ రఘునాథ్ సంఘటనాస్థలికి చేరుకొని కాలనీవాసులతో మాట్లాడి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

కాలనీలో సమస్యలివీ... !

పట్టణ పరిధిలో అతిపెద్ద మురికివాడైన లోతువానిగుంట కాలనీలో తాగునీరు సరిగ్గా రావడంలేదు. కనీసం చేతి బోరు కూడా పనిచేయడంలేదు. రోడ్లు, మురుగ కాలువలు అధ్వానంగా ఉన్నాయి. ఇక కాలనీవాసులకు పక్కాఇళ్లు మంజూరు చేయకపోవడంతో చాలా మంది పూరిగుడిసెల్లో నివాసం ఉంటున్నారు. కాలనీలో ఎక్కడచూసినా చెత్తాచెదారం పేరుకుపోవడంతో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. కాలనీలో ఉన్న పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు చుట్టూ ముళ్ల చెట్లు అధికమవడంతో విషసర్పాల బెడద ఎక్కువగా ఉంది.





అధ్వానంగా ఉన్న రోడ్లు, డ్రైనేజీ - తాగునీటి కొళాయికి డమ్మివేసి ఉన్న దృశ్యం - నిరుపయోగంగా ఉన్న చేతి బోరు

అంగన్వాడీలను బెదిరిస్తే ఆదిపరాశక్తులవుతాం




సూళ్లూరుపేటలో పాటలు పాడుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు - గూడూరులో దీక్ష

సూళ్లూరుపేట, జనవరి 8: తమ డిమాండ్లను పరిష్కరించకుండా బెదిరిస్తే ఆదిపరాశక్తులవుతామని అంగన్వాడీ యూనియన్ నాయకురాలు హైమావతి అన్నారు. 28వ రోజు సమ్మెలో భాగంగా సోమవారం కోటపోలూరు క్రాస్ వద్దనున్న టీవీఆర్‌ఆర్ కల్యాణ మండపం వద్ద జాతీయ రహదారి పక్కనే కూర్చొని అంగన్వాడీలు నిరసన చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకుండా బెదిరింపులకు పాల్పడడం అన్యాయమన్నారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నాలుగున్నరేళ్లు మాయమాటలతో కాలం గడిపాడరన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాటలు పాడి బై.. బై.. బై జగనన్నా అంటూ నినాదాలు చేశారు. దర్నా వద్దకు వచ్చిన సీడీపీవో శారదాంబ విధులకు హాజరుకావాలని అంగన్వాడీల నోటీసులు ఇచ్చే ప్రయత్నం చేయగా తమ డిమాండ్లను అంగీకరించే విధులకు హాజరుకాబోమని తిరస్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు రమణయ్య, అల్లెయ్య, సుధాకర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను రాష్ట్రప్రభుత్వం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు అన్నారు. సోమవారం స్థానిక గ్రామసేవకుల భవనం వద్ద అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 28వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని అమలు చేయడం దారుణమన్నారు. వెంటనే ఎస్మా చట్టాన్ని ఉపసంహరించుకుని అంగన్వాడీలకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, సురేష్, రామయ్య, ప్రసాద్, ఇంద్రావతి, ప్రభావతి, మునికుమారి, పెంచలమ్మ, లక్ష్మి, హైమావతి, మంగమ్మ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలంటూ 28 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు సోమవారం వినూత్నరీతిలో నిరసన తెలిపారు. చిన్నారుల చేత కాలకృత్యాలు చేయిస్తూ తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు ముకుంద మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మహిళలు అని కూడా చూడకుండా అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సంఘం ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకురాలు పాల్గొన్నారు.

కోట: రాష్ట్ర ప్రభుత్వం సమ్మెను అణచివేసేందుకు ఎస్మా చట్టాన్ని ప్రయోగించిదని, ఇలాంటి బెదిరింపులకు భయపడేది లేదని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు హెచ్చరించారు. కోటలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట సోమవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు నిరసన తెలిపారు. ఎస్మా జీవో ప్రతులను తగలబెట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

వెంకటగిరి: బంగారుపేట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేస్తున్న రిలేదీక్ష సోమవారం 28వ రోజు కొనసాగింది. కార్యక్రమంలో నాయకులు స్వరూపారాణి, మంజుల, సుభాషిణి, మమ్ములాబేగం, లక్ష్మి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.




గూడూరు, వెంకటగిరిలో ధర్నా నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు

హామీలను నెరవేర్చేవరకు సమ్మె

గూడూరు, జనవరి 8: రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేవరకు సమ్మె కొనసాగిస్తామని సీఐటీయూ పట్టణాధ్యక్షుడు బీవీ రమణయ్య అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక సమ్మె 14 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని పలుమార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా, అధికారులకు వినతిపత్రాలు అందజేసినా ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. దీంతో కార్మికులు సమ్మె చేపట్టాల్సి వచ్చిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు అనుగుణంగా జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో శివకుమార్, రమేష్, కోటేశ్వరరావు, మురళి, పెంచల ప్రసాద్, సంపూర్ణమ్మ, నారాయణమ్మ, పోలమ్మ, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారం 6వ రోజు కొనసాగింది కల్లూరు జాన్ మాట్లాడుతూ కార్మిక సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బాలాజి, నరేష్, రాజేష్, ఈశ్వరయ్య, సుబ్బరాయులు, నాగేశ్వరావు, శ్రీను, వేణు, మరళి తదితరులు పాల్గొన్నారు.




గూడూరు, నాయుడుపేటలో భోగిమంటలు వేస్తున్న ఉపాధ్యాయులు. విద్యార్థులు

ముందస్తు సంక్రాంతి సంబరాలు

గూడూరు, జనవరి 8: మండలంలోని చెన్నూరు జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులను ధరించి గాలిపటాలను ఎగురవేస్తూ, భోగిమంటలు వేసి సంబరాలు జరుపుకున్నారు. పాఠశాల ఆవరణలో గ్రామస్థులకు ముగ్గులపోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బాలనాగమ్మ మాట్లాడుతూ తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలను, పండగల విశిష్టతను తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో శ్రీవాణి, లోకేశ్వరి, జమీల, సందానీ, రాజశేఖర్, శ్రీనివాసరావు, శంకరయ్య, కోటి, రాఘవేంద్ర, నజీర్, మల్లికార్జున, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పారిచెర్లరాజుపాళెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం కృష్ణంరాజు ఆధ్వర్యంలో ముగ్గులపోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

నాయుడుపేట టౌన్: పట్టనంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థినులు రకరకాల ముగ్గులు వేశారు. భోగిమంటలు వేసి సంబరాలు చేసుకున్నారు.

చిల్లకూరు: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు గొబ్బిళ్లపెట్టి సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కోదండం మాట్లాడుతూ కనుమరుగవుతున్న మన సంస్కృతి సంప్రదాయలను విద్యార్థులకు గుర్తుచేసేలా ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సులోచన, కమలకుమారి, ఉమాదేవి, స్వర్ణలత, చంద్రయ్య, పీటర్, శంకరయ్య, మల్లికార్జున్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కోట: మండల పరిధిలోని చిట్టేడు ఎస్సీ బాలికల వసతిగృహంలో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఏఎస్‌డబ్ల్యూవో, వార్డెన్‌లు పద్మజ, ఉషారాణి బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోటలోని ఎస్సీ బాలికల వసతిగృహ విద్యార్థినులు కూడా పాల్గొన్నారు.



చిల్లకూరులో విద్యార్థినులు, ఉపాధ్యాయుల సంబరాలు

ఆర్టీసీ బస్సులు లేక ప్రయాణికుల ఇక్కట్లు



బస్టాండ్‌లో వేచివున్న ప్రయాణికులు

వెంకటగిరి టౌన్, జనవరి 8: వెంకటగిరి డిపో పరిధిలో ఆర్టీసీ బస్సులు లేక ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. వెంకటగిరి చుట్టు పక్కల మేనకూరు, శ్రీసిటీ, రేణిగుంట వద్ద పలు కంపెనీలు, ఐఐహెచ్‌టీ, ఐఐఎస్‌ఈఆర్ వంటి కంపెనీలు ఉండడంతో ఉద్యోగాలకు వెళ్లేందుకు ప్రజలు బస్సుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రయాణికులు రద్దీకి తగినట్లు ఆర్టీసీ యాజమాన్యం బస్సులు పెంచడంలేదు. అంతేకాకుండా ఆర్టీసీ బస్సులు సమయానికి రాకపోవడంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గత ప్రభుత్వంలో వెంకటగిరి డిపో పరిధిలో ఆర్టీసీ బస్సులు 72 ఉండగా, వైసీపీ అధికారంలోకి వచ్చాక 66కి కుదించింది. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సుల సంఖ్య పెంచడంతో సమయ పాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నక్కలోళ్లకు న్యాయం జరిగేవరకూ పోరాటం



మున్సిపల్ కార్యాలయం ఎదుట నక్కలోళ్లు, టీడీపీ నాయకుల నిరసన

నాయుడుపేట టౌన్, జనవరి 8: సంచారజాతులు (నక్కలోళ్ల)కు న్యాయం జరిగేవరకు పోరాడతామని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి అన్నారు. నాయుడుపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం సంచారజాతులవారితో కలసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత బస్టాండ్ సమీపంలో నుంచి నక్కలోళ్లను ఉన్నఫలాన ఖాళీ చేయించడం సబబు కాదన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీ స్థలాలను పరిరక్షించుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారన్నారు. పట్టణంలో అక్రమ కట్టడాలను అడ్డుకొని చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పసల గంగాప్రసాద్, ఇమిడిశెట్టి వెంకటేశ్వర్లు, బాబు, సులేమాన్, చరణ్ తదితరులు ఉన్నారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్రపై అవగాహన

ఓజిలి, జనవరి 8: ఓజిలి మండలం వెంకటరెడ్డిపాళెంలో సోమవారం వికసిత్ భారత్ సంకల్పయాత్రపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో రజనీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో స్థానిక హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు ముమ్మడి సుబ్బారావు మహిళలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న ఉచిత గ్యాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పథకం కింద మండలంలో ఇప్పటి వరకు 160 మంది మహిళలను గుర్తించి, ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇఎసి ఆర్‌డి మోహన్ ఏపీఎం నిర్మలమ్మ, ఏపీవో ఉషారాణి, పంచాయతీ కార్యదర్శులు సిరాజ్, ధరణి, బీజేపీ మండల కన్వీనరు ప్రసాద్, వైద్యఆరోగ్య, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మ ప్రత్యేక పూజలు



పోలేరమ్మకు మొక్కుకుంటున్న డాక్టర్ మస్తాన్ యాదవ్

వెంకటగిరి, జరనవరి 8: టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన డాక్టర్ మస్తాన్ యాదవ్ సోమవారం తన అనుచరులు, నాయకులతో కలిసి గ్రామ శక్తి పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు కార్యదర్శి బాధ్యతలు అప్పజెప్పిన టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడికి, ప్రధన కార్యదర్శి నారా లోకేశ్‌కు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. తన ట్రస్టు కార్యాలయంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం మస్తాన్ యాదవ్‌ను టీడీపీ నాయకులు సత్కరించారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

సూళ్లూరుపేట, జనవరి 8: సూళ్లూరుపేట పట్టణం సాయినగర్‌లో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకుడు ఎంఎం.చంద్రబాబు, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు ఉష, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు అందజేస్తున్న సంస్థ నిర్వాహకులు